తెలంగాణ

తెలుగు జాతీయ దినపత్రిక

# తెలుగు-వెలుగు

ప్రతిక్షణం ప్రజల పక్షం








సంపుటి : 02 సంచిక 332 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి సోమవారం 19-5-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur



# హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

## ప్రమాదంలో 17 మంది మృతి

హైదరాబాద్: చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గుల్జార్ హౌస్‌లోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఏర్పాటు చేసిన ఏసీ కంప్రెషర్ పేలి మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో 17 మంది చనిపోయారు. ఘటనా స్థలిలోనే నలుగురు చనిపోగా.. మరో ఏడుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. మరికొంతమంది గాయపడగా.. క్షతగాత్రులను మలక్‌పేటలోని యశోద ఆస్పత్రి, అపోలో, డీఆర్డీవో ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### అసలేం జరిగింది..

ఆదివారం గుల్జార్ హౌస్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు 15మందికి పైగా చిక్కుకున్నారు. భారీగా మంటలు ఎగసిపడ్డాయి. చుట్టుపక్కల ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. ఫైరింజన్ సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే, అప్పటికే మంటల్లో చిక్కుకున్న వారిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. వీరిలోనూ ఐదుగురు చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



### స్థానికుల భయాందోళనలు..

ఏసీ కంప్రెషర్ పేలడంతో మంటలు భారీగా చెలరేగాయి. ప్రమాదం చోటు చేసుకున్న బిల్డింగే కాకుండా.. చుట్టుపక్కల ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల తీవ్రత అధికంగా ఉండటం, దట్టమైన పొగ కమ్ముకోవడంతో పోలీసులు చార్మినార్ పరిసర ప్రాంతాల్లోని రోడ్లను బ్లాక్ చేశారు. ఫైర్ సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

### బాధితులను పరామర్శించిన కేంద్రమంత్రి..

అగ్నిప్రమాదం గురించి తెలుసుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటానని.. అధైర్య పడవద్దని బాధితులకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధైర్యం చెప్పారు.

# బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**హైదరాబాద్, మే 18 :** పాతబస్తీలోని గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాద ఘటనలో 17 మంది మృతిచెందారు. ఈ ఘటనపై పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (%ఖు=%) స్పందించారు. ఈ విషాద ఘటన వివరాలు తెలిసి అత్యంత షాక్‌కు, బాధకు గురయ్యానని తెలిపారు. ఈ విషాద ఘటన చాలా హృదయవిదారకంగా ఉందని చెప్పారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఇవాళ(ఆదివారం) కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని క్షతగాత్రులకు మెరుగైన ఉచిత చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ సంక్షోభ సమయంలో అవసరమైన ఏ సహాయానికైనా అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ ఘటనలో బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు బీఆర్ఎస్ స్థానిక నాయకులు, కార్యకర్తలు అధికారులతో కలిసి పనిచేస్తారని అన్నారు. స్థానిక బీఆర్ఎస్ నేతలకు ప్రమాద స్థలం వద్ద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కేటీఆర్ సూచించారు. ప్రభుత్వం ఈ అగ్నిప్రమాదానికి కారణాలను లోతుగా విచారించి, భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓల్డ్ సిటీతో పాటు హైదరాబాద్ నగరంలో అగ్ని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, అగ్నిమాపక శాఖ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ విషాద సమయంలో హైదరాబాద్



ప్రజలందరూ ఐక్యంగా నిలిచి, బాధితులకు అండగా ఉండాలని మాజీ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై ఎమ్మెల్యే మెగారెడ్డి సంచలన వ్యాఖ్యలు

**వనపర్తి,మే 18 :**



మాజీమంత్రి నిరంజన్ రెడ్డిపై కాంగ్రెస్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీమంత్రి నిరంజన్ రెడ్డి భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కృష్ణానది స్థలాన్నిఆయన ఆక్రమించారని విమర్శించారు. ఆదివారం వనపర్తిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మెగారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆ నది పరివాహక ప్రాంతంలో మట్టిని తోడేస్తూ, దుర్వినియోగం చేస్తూ ఆయన భూ కబ్జాల నిరంజన్ రెడ్డిగా మారారని ఆరోపణలు చేశారు. గద్వాల జిల్లా మానవపాడు మండలం చండూరు శివారులోని సర్వే నంబరు 57లో విలువైన భూమిని నిరంజన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు కబ్జా చేశారని మండిపడ్డారు. వారు ఆ భూమిని కబ్జా చేసినట్లు ఆధారాలతో సహా నిర్ధారణ అయిందని ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో నిరంజన్ రెడ్డి రూ.25 లక్షల సబ్సిడీ తీసుకుని ఆయన బిడ్డల పేర్ల మీద ఆ భూమిని మార్చుకున్నారని ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి విమర్శలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉంటూ వనపర్తి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నిరంజన్ రెడ్డి వ్యవహారాన్ని ఆధారాలతో సహా బట్టబయలు చేశామని అన్నారు.

# పెరిగిన మద్యం రేట్లు



**హైదరాబాద్, మే 18:** అసలే వేసవి కాలం. ఎండలు మండిపోతున్నాయి. అలాంటి వేళ..కూల్ కూల్‌గా మందు కొడదామనుకొనే మందు బాబులకు తెలంగాణ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. మద్యం ధరలు పెంచుతున్నట్లు దుకాణాలకు ఎక్సైజ్ శాఖ ఆదివారం సర్క్యూలర్ పంపింది. క్వార్టర్ బాటిల్‌పై రూ. 10 పెంచింది. అలాగే ఆఫ్ బాటిల్‌కి రూ. 20, ఫుల్ బాటిల్‌పై రూ. 40 పెంచింది. ఈ మేరకు జారీ చేసిన సర్క్యూలర్లలో ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. మరోవైపు.. ఇప్పటికే బీరు ధరలు ప్రభుత్వం పెంచింది. అలాగే మద్యం ధరలను సైతం పెంచాలని నిర్ణయించింది. ధరల కమిటీ సూచనలు, మద్యం కంపెనీల అభిప్రాయాలను తీసుకుని నెల క్రితమే ఎక్సైజ్ కమిషనర్ నివేదికను రూపొందించారు. అనంతరం దీనిని ప్రభుత్వం ముందు ఉంచారు. ఈ పెంచిన మద్యం ధరలతో ఏడాదికి రూ. 2 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చే విధంగా నివేదిక రూపొందించింది. మద్యం సరఫరా కోసం.. లిక్కర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం జూన్ 30వ తేదీతో ముగియనుంది. జులై 1వ తేదీ నుంచి కొత్త ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ లోపే మద్యం ధరలు పెంచి.. డిస్టిలరీలు, డిస్ట్రిబ్యూటర్లు, సప్లై కంపెనీతో ఒప్పందాలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే.. ఛీప్ లిక్కర్ల ధరలు తెలంగాణలో అధికంగా ఉంది. ఇంకా ధరలు పెంచితే.. ఛీప్ లిక్కర్ వ్యాపారం కుప్పకూలిపోతుందని .. తర్వాత ఇతర రాష్ట్రాల నుంచి ఎన్డీపీఎల్ మద్యం, ఫేక్ లిక్కర్ అక్రమ రవాణా పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఛీప్ లిక్కర్ ధరలు నియంత్రణలో ఉంచాలని ఎక్సైజ్ కమిషనర్ ప్రభుత్వానికి ఇప్పటికే సూచించినట్లు తెలుస్తోంది. ఇంకోవైపు.. ధరలు పెరగకుండా కర్ణాటక తరహాలో మద్యాన్ని టెట్రా ప్యాకెట్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# లష్కరే టాప్ కమాండర్ హతం



**ఇస్లామాబాద్:** పాక్ కేంద్రస్థానంగా పనిచేసే లష్కరే తొయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్ అబు సైఫుల్లా ఆదివారం నాడు హతమయ్యాడు. పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అతన్ని కాల్చి చంపినట్టు భద్రతా వర్గాలు తెలిపాయి. సైఫుల్లాకు వినోద్ కుమార్, మొహమ్మద్ సలీమ్, ఖలీద్, వనియాల్, వాజిద్, సలీమ్ భాయ్ అనే మారుపేర్లు కూడా ఉన్నాయి. లష్కరే ఆపరేషన్లు, రిక్రూట్‌మెంట్ల నిర్వహణ, నిధుల సమీకరణ, సరిహద్దు చొరబాట్లలో సైఫుల్ కీలకంగా వ్యవహించే వాడు. భారత్‌లో జరిగిన పలు కీలక ఉగ్రదాడుల్లోనూ సైఫుల్లా కీలకంగా వ్యహరించాడు. ఉత్తర్ ప్రదేశ్‌లోని రాంపూర్‌లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)పై 2001లో జరిగిన దాడికి సైఫుల్లా వ్యూహరచన చేశాడు. 2008లో నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంపై దాడి ఘటనకూ ప్లాన్ చేసినది ఇతనే. 2005లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ) వద్ద జరిగిన బాంబు పేలుడుతోనూ సైఫుల్లాకు సంబంధం ఉంది. కాగా, నేపాల్‌లో లష్కరే కీలక మాడ్యూల్‌గా సైఫుల్లా వ్యవహరించే వాడు. పోరస్ ఇండో-నేపాల్ సరిహద్దు గుండా టెర్రరిస్టులను భారత భూభాగంలోకి పంపేందుకు మార్గం సుగమం చేసేవాడు. లష్కరే తొయిబా, దాని పొలిటికల్ ఫ్రండ్ జమాత్ ఉద్ దవా (జేయూడీ)కి ఫండ్‌రైజర్‌గా వ్యవహరించేవాడు. పాక్‌లోని సింధ్ ప్రావిన్స్ బదిన్ జిల్లా మాట్లి తాలూకాలో ఆదివారం నాడు గుర్తుతెలియని వ్యక్తుల చేతుల్లో సైఫుల్లా హతమవడంతో లష్కరేకి గట్టి దెబ్బే తగిలినట్టయింది.

# 24న ఢిల్లీ వెళ్లనున్న సీఎం స్టాలిన్..

చెన్నై: రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 24న ఢిల్లీ బయలుదేరి వెళుతున్నారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగే నీతి ఆయోగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. 2015లో కేంద్ర ప్రణాళికా సంఘానికి బదులుగా నీతి ఆయోగ్ కమిటీ ఏర్పాటైంది. ప్రధాని నరేంద్రమోదీ ఈ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇప్పటి వరకూ 9 సార్లు ఈ కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ కమిటీ పదో సమావేశం ఈ నెల 24న ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగనుది. ఈ సమావేశంలో పాల్గొనాలని దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ఆహ్వానించింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు స్టాలిన్ వెళ్తున్నారు. గత ఏడాది జూలై 27న జరిగిన నీతి ఆయోగ్ 9వ సమావేశాన్ని స్టాలిన్ బహిష్కరించారు. ఈ పరిస్థితులలో ఈ నెల 24న జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో స్టాలిన్ పాల్గొననున్నారు. ఆ సందర్భంగా రాష్ట్రానికి విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచిన నిధులను విడుదల చేయాలని స్టాలిన్ ఈ సమావేశంలో డిమాండ్ చేయనున్నారు.

# సెవన్ సిస్టర్స్‌పై యూనస్ వ్యాఖ్యలకు భారత్ కౌంటర్

**న్యూఢిల్లీ:** భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలను ఉద్దేశించి బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వైజర్ మహ్మద్ యూనస్ ఇటీవల చైనాలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సెవన్ సిస్టర్స్‌గా పిలిచే ఏడు ఈశాన్య రాష్ట్రాలకు సముద్ర మార్గం లేదని, సముద్రం తీరంతో ఈ ఏడు రాష్ట్రాలకు బంగ్లాదేశ్ సాగర రక్షకుడిగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. బ్యాంకాక్ వేదికగా గత శుక్రవారం జరిగిన బిమ్‌స్టెక్ సదస్సు సందర్భంగా యూనస్, భారత ప్రధాని మోదీ భేటీ అయినప్పుడు దీనికి సున్నితంగానే మోదీ బదులిచ్చారు. ఈ తరహా వ్యాఖ్యలు మంచిది కాదన్నారు. ఇదే సమయంలో.. షిల్లాంగ్ టు సిల్చార్ వరకూ హైవే నిర్మాణంతో భారత ప్రభుత్వం బంగ్లాదేశ్‌కు ఇప్పుడు దీటైన జవాబు కూడా ఇవ్వబోతోంది. షిల్లాంగ్ టు సిల్చార్ వరకూ హైవే నిర్మాణానికి భారత ప్రభుత్వం ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈశాన్య రాష్ట్రాలు, కోల్‌కతా మధ్య సముద్ర మార్గం ద్వారా ప్రత్యామ్నాయ లింక్‌గా ఈ హైవే ఉంటుంది. నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఐడీసీఎల్)కు చెందిన ఒక అధికారి ఈ సమాచారం ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న ఈ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.దీనికి అయ్యే అంచనా వ్యయం రూ.22,864 కోట్లు.ప్రాజెక్టుపొడుగుమేఘాలయలో 144.8 కిలోమీటర్లు, అసోంలో 22 కిలోమీటర్లు. ఈ ప్రాజెక్టు పూర్తయిందంటే ఈశాన్య రాష్ట్రాలకు మార్గంగా ఉంటూ వస్తున్న సిలిగిరి ప్రాజెక్టుపై ఆధారపడటం తగ్గిపోతుంది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వయిజర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు ఈ హైవే ప్రాజెక్టే గట్టి సమాధానం అవుతుందని ఎన్‌హెచ్ఐడీసీఎల్ అధికారి తెలిపారు. కాగా, ఈ ప్రాజెక్టుకు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే.. 166.8 కిలోమీటర్ల ఫోర్ లేన్ హైవేను షిల్లాంగ్ సమీపంలోని మావ్లింగ్‌ఖుంగ్ నుంచి అసోంలోని నేషనల్ హైవే-6పై సిల్చార్ సమీపంలోని పాంచగ్రామ్ వరకూ నిర్మించనున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి ఇది తొలి హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టు కానుంది. రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మంత్రిత్వ శాఖతో కలిసి ఎన్‌హెచ్ఐడీసీఎ



ల్ దీనిని అభివృద్ధి చేస్తోంది. 2030 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉంది. దీనికి అదనంగా, కలాదాన్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టుకు మయన్మార్‌లోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఫండింగ్ చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోల్‌కతా నౌకాశ్రయాన్ని మయన్మార్‌లోని పాలెట్వాను సముద్రమార్గం ద్వారా కలుపుతుంది. మిజోరాంలోని జోరిన్‌పుయిని రోడ్డు మార్గం ద్వారా కూడా కలుపుతుంది. ఇది పూర్తయితే బంగ్లాదేశ్‌ను ఇండియా పట్టించుకోన వసరం లేదు. కలాదాన్ ప్రాజెక్టు ద్వారా ఈశాన్య ప్రాంతం సరుకులు విశాఖపట్నం, కోల్‌కతా చేరుకుంటాయి. ఇక బంగ్లాదేశ్‌పై ఆధారపడాల్సిన అవసరం ఎంతమాత్రం ఉండదు. ఈ హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వచ్చిందంటే ఈ మార్గంలో ఈజీగా సరకు రవాణా జరగడంతోపాటు ఈ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలూ శీఘ్రగతిన పెరుగుతాయి. ప్రస్తుతం సిలిగురి కారిడార్ ద్వారా మాత్రమే ఏడు ఈశాన్య రాష్ట్రాలకు చేరాల్సి వస్తోంది. దీనినే 'చికెన్ నెక్'గా పిలుస్తుంటారు.

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
సోమవారం 19-5-2025



# మీరేం చేస్తే మేమూ అదే చేస్తామంటున్న పాక్.. విదేశాలకు ప్రతినిధి బృందాలు

**విదేశాలకు శాంతి రాయబారుల బృందాన్ని పంపుతున్న పాక్ ప్రధాని**


**ప్రతిపక్ష నేత బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలో బృందం ఏర్పాటు**

**మోదీ ఎయిర్ ఫోర్స్ బేస్ ను సందర్శిస్తే సైనిక శిబిరాన్ని విజిట్ చేసిన షరీఫ్**

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ ప్రభుత్వం ప్రతీ విషయంలోనూ భారత్ను అనుకరిస్తోంది. మీరేం చేస్తే మేమూ అదే చేస్తామన్నట్లు ప్రవర్తిస్తోంది. ఉగ్రదాడి ఘటన తర్వాత టెర్రరిజంపై భారత పోరాటాన్ని, ఉగ్రవాదంపై పాక్ వైఖరిని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టేందుకు భారత ప్రభుత్వం ఏడుగురు ఎంపీల బృందాలను వివిధ దేశాలకు పంపించనున్నట్లు శనివారం ప్రకటించి ంది. భారత్ ఇలా ప్రకటన చేసిందో లేదో పాకిస్థాన్ వెంటనే అందుకుంది. శాంతి రాయబారుల పేరుతో తమ ఎంపీల బృందాన్ని విదేశాలకు పంపించనున్నట్లు ప్రకటించింది. ప్రతిపక్ష నేత బిలావల్ భుట్టో జర్దారీ ఈ బృందానికి నాయకత్వం వహిస్తారని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. దీనిపై బిలావల్ భుట్టో ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ.. అంతర్జాతీయ వేదికలపై పాకి స్థాన్ గొంతుక వినిపించే అవకాశం ప్రధాని షెహ బాజ్ షరీఫ్ తనకు అప్పగించారని చెప్పారు. ఈ విషయంపై ప్రధాని తనతో సంప్రదింపులు జరిపారని వివరించారు. ఈ బాధ్యతను స్వీకరించడం తనకు గర్వకారణమని అన్నారు. దేశసేవ కోసం తాను ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ లోని ఆదంపూర్ వైమానిక స్థావరాన్ని సందర్శించగా.. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సియాల్‌కోట్‌లోని తమ సైనిక స్థావరాన్ని సందర్శించిన విషయం తెలిసిందే.

# మహిళల్లో చైతన్యం పెరగాలి

**- బీసీ లంతా ఏకం కావాలి - బిసి సేన జిల్లా నాయకులు సదర్ శ్రీనివాస్**







రంగారెడ్డి జిల్లా జిల్లేడుచౌదర్ గూడా మండలం పెద్ద ఎలికిచర్ల గ్రామంలోజాతీయ బీసీ సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ కమిటీ ఎన్నికకు ముఖ్య అతిధిగా జిల్లా ముఖ్యనాయకులు సదర్ శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. పెద్ద ఎలకిచర్ల గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా శోభారాణి, ఉపాధ్యక్షురాలు వడ్లవిజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నేరముని మంజుల, కోశాధికారి గుడిసె లక్ష్మి , కార్యదర్శి బొద్ద నాగమణి నియమించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సదర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా చైతన్యం పెరగాలని మహిళలందరూ ప్రతి ఒక్కరు ధైర్యంతో ముందడుగు వేయాలన్నారు. బీసీలందరూ ఐకమ త్యంతో కలిసిమెలిసి మెలగాలని, రాజకీయపరంగా ఆర్థికంగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలనేది బీసీ సేన ముఖ్య ఉద్దేశమన్నారు.

**కాసులాబాద్‌లో...**

కాసులా బాద్ గ్రామ బీసీ సేన అధ్యక్షురాలిగా పందెణ్ పల్లి అరుణ, ఉపాధ్యక్షురాలు చిటికెల అనిత, ప్రధాన కార్యదర్శి సాలేటి సుజాత, కార్యదర్శి గండేటి స్రవంతి, కేతముని మంజుల, కమిటీ సభ్యులుగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ హాజరై మాట్లాడుతూ నేటి సమాజంలో మన పిల్లలకు భవిష్యత్తులో న్యాయం జరగాలంటేమహిళలందరూ ఏకతాటి పైకి వచ్చే స్వభావాన్ని పెంచుకోవాలన్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎవరినో నమ్మి కూర్చోకుండా మన వంతుగా ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమాలలో నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు కత్తి శేఖర్ అప్ప, షాద్ నగర్ టౌన్ అధ్యక్షురాలు కాటమ్ భాగ్యలక్ష్మి గౌడ్, నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు చెన్న బాలరాజ్ ప్యాట శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఆత్మహత్య ఎప్పుడూ పరిష్కారం కాదు...

**సీసీఐ నేతలు యువతకు హెచ్చరిక**

**డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు కుటుంబాన్ని పరామర్శించిన సిసిఐ రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమ్ రెడ్డి**

ప్రముఖ సామాజికవేత్త డా. కొమ్ము వెంకన్న బాబు కుమారుడు డాక్టర్ మహర్షి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తీవ్ర ప్రతిధ్వనులను కలిగించింది. ఈ దుఃఖదాయక సందర్భంగా కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నేతలు ఆదివారం డా. వెంకన్న బాబు నివాసంలో కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి భీమ్రెడ్డి నేతృత్వంలోని టీం కుటుంబానికి దుఃఖానుభూతి తెలిపారు. ఒక్క క్షణం ఆవేశంలో తీసుకున్న నిర్ణయం ఒక కుటుం బాన్ని చితికాద్చేసింది. తండ్రిగా ఎదుర్కొంటున్న బాధను మాటలతో వర్ణించలేమని భీమ్రెడ్డి భావోద్వే గంతో పేర్కొన్నారు.యువకులు ఏ పరిస్థితిలోనైనా ధైర్యంగా నిలవాలి. ఆత్మహత్య ఎప్పుడూ పరిష్కారం కాదని ఉపాధ్యక్షుడు ఏ.వీ రావ్ హితవు చెప్పారు. సీసీఐ జాతీయ నాయకురాలు హరిప్రియ ప్రత్యేకంగా యువతను ఉద్దేశించి, సామాజిక ఒత్తిడులు, వ్యక్తిగత సమస్యలు ఎల్లవేళలా ఉంటాయి. కానీ వాటిని ఎదుర్కోవడానికి మానసిక బలం, సమర్థవంతమైన మార్గదర్శకత్వం అవసరమని నొక్కి చెప్పారు.సీసీఐ నేతలు ఈ



సంఘటనను ప్రధానంగా తీసుకుని ప్రభుత్వానికి రెండు ముఖ్యమైన డిమాండ్లు విధించారు.మానసిక ఆరోగ్య విద్యను పాఠ్యాంశాల్లో చేర్చాలి.అన్ని ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్లలో కౌన్సిలింగ్ సెల్లులు ఏర్పాటు చేయాలి అని ప్రభుత్వానికి సూచన చేశారు. రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ ఆత్మహత్యలు అరికట్టడానికి యువతలో మానసిక ఆరోగ్య అవగాహనను పెంచే కార్యక్రమాలు తప్పనిసరని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర అడ్వైజర్ సత్యనారాయణ రెడ్డి, సహాయరాష్ట్ర కార్యదర్శి నరసింహారెడ్డి, స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు మాదారం యాదిరెడ్డి, బెంజుసరియా పేపర్ మిల్ ఉద్యోగి రమణయ్య, రామ్ చందర్ తదితరులు పాల్గొని వెంకన్న బాబు కుటుంబాన్ని ఓదార్చారు..

# దోశలో బొద్దింక...



**వినియోగదారుడికి వాంతులు విరోచనాలు**

**అదే తీరుతో వ్యవహరిస్తున్న రాఘవేంద్ర ఉడిపి హొటల్**

గత కొంతకాలంగా షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో ఉన్న రాఘవేంద్ర ఉడిపి హొటల్లో బొద్దింకలో అన్నంలో వెంట్రుకలు వస్తున్నాయని ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. కానీ నేడు ఒక వినియోగదారుడు దోష ఆర్డర్ చేయగా సగం తిన్న తర్వాత దోశలో బొద్దింక ఉందని గమనించి వాంతింగ్ కు చేసుకున్నారు. దీంతో హొటల్ యజమాన్యాన్ని ప్రశ్నించగా పొంతన లేని నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇడ్లీలో బొద్దింక వచ్చిందని ఎన్నో ఆరోపణలు ఉన్నాయి.


**ఫుడ్ ఇన్స్పెక్టర్ల తనిఖీలపై నిర్లక్ష్యం ఎందుకు.?**

ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పటికీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇంతవరకు ఏ విధమైన కఠినమైన చర్యలు తీసుకోకపోవడం ప్రజలలో ఆగ్రహాన్ని పెంచింది. హొటల్ యజమానులు తమ తప్పును అంగీకరించకుండా, వినియోగదారుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది ఆరోగ్య ప్రమాదాలను మరింత పెంచుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించని హొటళ్లపై ఉక్కు పాదం మోపాలని వినియోగదారులు కోరుతున్నారు. ఇలాంటి పునరుత్వం కాకుండా పటిష్టంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత

కేశంపేట: కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన యాలాల నరసింహ శనివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందాడు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాజు ద్వారా విషయాన్ని కేశంపేట తాజా మాజీ జెడ్పిటిసి విశాలాశ్రవణ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాడు. తక్షణమే స్పందించిన మాజీ జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం 5000 వేల రూపాయలను శనివారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాజు ద్వారా అందజేశారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించిన విశాల శ్రవణ్ రెడ్డికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెలిజర్ల గ్రామంలో ఆధ్యాత్మిక శోభ



ఫరూఖ్ నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం, రామాలయం ప్రారంభోత్సవ భక్తి కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధ్వజ స్తంభం, నవగ్రహాలకు నీళ్ళు పోసి పూజ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కావాలి నర్సింహులు, సభ్యులు అనిమి గణేష్ గౌడ్, కటికెల తిరుపతి యాదవ్ ,మట్ట వెంకటేష్ గౌడ్, దొడల శివ కుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నేతలు జాంగారి జంగయ్య, కావాలి జగన్ ,జాంగారి రవి, కందు రీ ముఖుంద గౌడ్, నేతలు సత్యం రెడ్డి, తుప్పరి శేఖర్, కావాలి జంగయ్య,కావాలి బాల నర్సింహులు, వట్టెల మహేష్ యాదవ్, దోడల శ్రీనివాస్ యాదవ్ ,మట్ట సురేష్, నరేష్, తమ్మలీ బుచ్చయ్య, వేముల నర్వ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు

## దేవాలయాల, బొడ్రాయి ప్రతిష్ట ప్రారంభోత్సవాలకు రండి

**మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు**

**డీకే అరుణకు వెలిజర్ల శివాలయ పునర్నిర్మాణ కమిటీ ఆహ్వానం**



వెలిజర్ల గ్రామంలో నిర్వహించే శివాలయ, రామాలయ, నవగ్రహాలు, నాగదేవతలు, బొడ్రాయి, పోతురాజు విగ్రహాల మరియు ధ్వజస్తంభాల ప్రతిష్టాపన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణని శివాలయ పునర్నిర్మాణ కమిటీ వెలిజర్ల కరపత్రాన్ని అందజేసి ఆహ్వానించారు. తేదీ 19-05-2025 నాడు జరిగే ఈ ప్రతిష్ట ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులు పుర ప్రముఖులు అధికారులు స్థానిక నాయకులందరూ రానున్నందున మీరు ముఖ్య అతిథిగా మీరు రావాలని కోరారు. ఆహ్వాన పత్రిక అందుకున్న మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ అందుకు సానుకూలంగా స్పందిస్తూ గ్రామస్తులు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు, ఈ కార్యక్రమంలో శివాలయ పునర్నిర్మాణ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఈరమోని రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దోడల వెంకటేష్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనిమి ముకుందం గౌడ్ ,ఎగ్జిక్యూటివ్ మెంబర్ మంగలి నరేష్, బిజెపి సీనియర్ నాయకులు మేక నరేందర్ రెడ్డి, పాత్లవత్ శ్రీను నాయక్, లాస్కర్ నాయక్, మోహన్ సింగ్,అమీర్ పేట వెంకటేష్ గౌడ్, గ్రామస్తులు ఎల్లారం సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొట్టం బాలకృష్ణారెడ్డి మృతి



షాద్‌నగర్ నియోజకవర్గము కేశంపేట మండలం తులవాని గడ్డ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొట్టం బాలకృష్ణారెడ్డి మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. గత రాజకీయాల్లో బాలకృష్ణారెడ్డి క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. అప్పటి మాజీ మంత్రి డాక్టర్ పి శంకర్రావు, రాయికల్ దామోదర్ రెడ్డి, మల్లు రవి తదితర నాయకుల ఆధ్వర్యంలో పనిచేశారు. కాంగ్రెస్ వాదిగా ఆయనకు ఈ మండలంలో మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. బాలకృష్ణారెడ్డి మృతి వార్త తెలుసుకున్న మండల నాయకులు కార్యకర్తలు ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు..

# మరువమమ్మా.. నిను ఇందిరమ్మ..!

## షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

కొత్తూరు మండలంలో వైభవంగా ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపనలు
సిద్దాపూర్ వైయ్యం తండా ఎస్ బి పల్లిలో ఎమ్మెల్యే పర్యటన
గ్రామ గ్రామాన స్వాగత సత్కారాలు ఏర్పాటుచేసిన మహిళలు
ఆటపాటలతో అభిమానుల కార్యకర్తల గ్రామీణుల స్వాగతం
గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం సందర్భంగా హామీ ఇచ్చారు సంకల్పం నెరవేరుస్తున్నారు
ఎమ్మెల్యే శంకర్ కు మంగళ హారతులు పట్టి మహిళల ఆదరణ





సొంత ఇంటి కోసం ఎదరుచూస్తున్న నిరు పేదల్లో ఆశలు చిగురుంపజేసి ఇందిరమ్మ రాజ్యంలో కలలుగన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సహకారానికి ప్రభుత్వం పునాదులు వేస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం నియోజకవర్గం లోని కొత్తూరు మండలం సిద్దాపూర్ వైన్ తాండ ఎస్బి పల్లీలలో తొలి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఘనంగా శంకుస్థాపన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిద్ధాపూర్ గ్రామంలో తొలి దశలో మంజూరైన 23 ఇండ్లు, ఏనుగు మడుగు తండాలో 6 ఇండ్లు, ఎస్బి పల్లిలో 17 ఇండ్లు తొలిదశలో మంజూరయ్యాయని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులు గ్రామీణ ప్రజలు అభిమానులు కార్యకర్తల కులాల మధ్య ఎమ్మెల్యే శంకర్ మహిళలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల విష యంలో సొంత స్థలం ఉన్నవారికి మొదట ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ లబ్ధిదారుల్లో ఆనందం కనిపిస్తుందని ఎవరి నోటా విన్న "మరువమమ్మ నిన్ను ఇందరమ్మ" అని అంటున్నారని ఎమ్మెల్యే శంకర్ అన్నారు.

### ఎన్నికల ప్రచారంలో భాగంగా....

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆనాడు హామీ ఇచ్చిందనీ ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఆ హామీలో భాగంగానే ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందనీ విధి విధా నాలను ప్రభుత్వం ప్రకటించడంతో ఇళ్ల మంజూరుకు మార్గం సుగమమైందనీ అన్నారు.

### గత పాలకులు పంగనామాలు పెట్టారు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విష యంలో అనేక గ్రామాల్లో ప్రజలను మభ్యపెట్టి పదేళ్లు గడిపేందని విమర్శించారు. అల్లుడు వస్తే ఎక్కడ ఉండాలి గుడ్లను మేకలను ఎక్కడ కట్టాలి అని ప్రగల్భాలుకు పలికిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గత పది సంవత్సరాలలో నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ విషయంలో గత పాలకులు చేసిన తప్పులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పునరావృతం కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ మైన, అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో ఏం జరిగిందో ప్రజలకు అందరికీ తెలుసు అని ఓట్ల కోసం పరితపించారు తప్ప ఒక ఇల్లు కూడా ఎవరికి ఇవ్వలేదని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో అప్పటి ప్రజా ప్రతినిధుల జోక్యం పెరగడంతో పథకం వివాదాస్పదమెందనీ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ, పట్టణ సభల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి మంజూరు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

### నియోజకవర్గానికి 3500 ఇళ్లు....

నియోజకవర్గానికి 3500 ఇందిర మైండ్లు ప్రభుత్వ మంజూరు చేసిందని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామాలలో ప్రజల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని వారికి అన్ని రకాలుగా సాయం చేసేందుకు ప్రభుత్వం ముందుకు వస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఉచిత కరెంటు గ్యాస్ సబ్సిడీ, సన్న బియ్యం తదితర సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని గుర్తు చేశారు. ఇక్కడ చూసిన మహిళలు ఈ పథకాల అమలులో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాబోయే కాలంలో మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కొండంత అండగా నిలబడనున్నట్లు తెలిపారు.

### రావయ్యా శంకరయ్య..

రావయ్య శంకరయ్య అంటూ మహిళలు ఆప్యాయంగా ఎమ్మెల్యే శంకర్ గ్రామ గ్రామాన ఆప్యాయంగా స్వాగతం పలకడం విశేషం. కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ వై.యంతాండ ఎస్ బి పల్లి గ్రామాల్లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంకర్కు గ్రామస్తులు పెద్దలు మహిళలు అభిమానులు కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో మహిళలు ఎమ్మెల్యే శంకర్ కు మంగళహారతులు ఇచ్చి వీర తిలకాలు దిద్దారు. గత ఎన్నికల సందర్భంగా ప్రచారంలో వచ్చినప్పుడు ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వస్తే తాను గెలిస్తే ఇందిరమ్మ ఇండ్లను ఇస్తానని మళ్లీ ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువస్తానని హామీ ఇచ్చారని అనుకున్నట్టుగానే అన్ని జరిగాయని ఇప్పుడు తమ సొంతింటి కల నెరవేరబోతుందని పలువురు మహిళలు ఎమ్మెల్యే శంకర్ ను దీవించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు మహిళలు కార్యకర్తలు అభిమానులు తదితరులు హాజరయ్యారు..

# మురికివాడలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం...

## ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**




మురికివాడలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. రీచ్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 కమిటీ హాల్ లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై వైద్య శిబిరాన్ని సందర్శించి, వైద్య పరీక్షలు చేయించు కున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బి.పి, షుగర్ వంటి అన్ని జనరల్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్న రీచ్ హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య నిపుణులు అందిస్తున్న సలహాలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సమ్మారెడ్డి, డా?? రామకృష్ణ రెడ్డి, డా?? సృజన రెడ్డి, డా?? అమిత్, బి.వెంకటేష్ గౌడ్, పోశెట్టిగౌడ్, సురభి రమేష్ రావు, విష్ణు వర్ధన్ రెడ్డి, గోవర్ధన్, శ్రీశైలం, రఘు తదితరులు పాల్గొన్నారు.

## దాసాంజనేయ స్వామి దేవాలయానికి

# మైక్ సెట్ అందజేత..

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



కూకట్పల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధాలయం శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానంకు కూకట్పల్లి వాస్తవ్యులు పోలోజి పవన్ కుమార్ స్వరూప దంపతులు 80 వేల రూపాయల స్టీరియో మైక్ సెట్ అందజేశారు. కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ద్వారా శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానానికి ఆదివారం అందజేసినారు. ఈ సందర్భంగా దంపతు లను ఎమ్మెల్యే కృష్ణారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తులసిరావు కే. సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్త సత్తి శ్రీనివాసరెడ్డికి పితృ వియోగం

**తెలుగు - వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి) :**



పొలమూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి శ్రీనివాసరెడ్డి తండ్రి సూరారెడ్డి(90) ఆదివారం ఆకస్మిక మృతి చెందారు.సూరారెడ్డి పొలమూరు లో కమ్యూనిటీ హాలు, దేవాలయ నిర్మాణం, గ్రామ అభివృద్ధికి సహయ సహకారాలు అందించారు. పొలమూరు, కానేడు, బిక్కవోలు లో నిర్మించిన రైస్ మిల్లుల ద్వారా అనేక మందికి ఉపాధి కల్పించారు. ఆయనకి ఇద్దరు కుమారులు,ఇద్దరు కుమార్తెలు ఉండగా కుమారులు సత్తి కొండారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి కూడా రైస్ మిల్ రంగంలో స్థిరపడి ప్రముఖ పారిశ్రామికవేత్త లుగా పేరుగాంచారు. సూరారెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఎన్నికైన డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు భరత్ భూషణ్,గజల్ శ్రీనివాస్ తమ ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

## కార్యకర్తల కుటుంబ సభ్యులకు

# చెక్కులు అందజేసిన మనోజ్ రెడ్డి

**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి) :**





టిడిపి సభ్యత్వం కలిగిన ఇద్దరు కార్యకర్తల కుటుంబాలకు యువనేత, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి నల్లమిల్లి మనోజ్ రెడ్డి చెరో రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఆదివారం ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన టిడిపి కార్యకర్తలు కాటేటి సుధాకర్ (కుతుకులూరు), అర్జంగి ఆనందరావు (కోటపాడు)కి చెందిన కుటుంబ సభ్యులకు (పార్టీ ద్వారా చేసిన ప్రమాద భీమా ) చెక్ మనోజ్ రెడ్డి అందజేశారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, కర్రి చిన్నారెడ్డి, ఇంకా పలువురు ఎన్డిఏ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# హనుమాన్ దీక్షలు ఎంతో కఠినతరమైనవి

## పాపిరెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

పవిత్రమైన హనుమాన్ దీక్షలు ఎంతో కఠినమైనవని పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. హనుమాన్ మండల, అర్ధ మండల, పావు మండల హనుమాన్ దీక్ష ఆచరించిన స్వాముల్లో పాపిరెడ్డి నగర్ కు చెందిన బోకూరి చంద్రారెడ్డి స్వామి, వి.వేణు స్వాములు ఆదివారం పాపిరెడ్డి నగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం నుంచి తాడు బంద్ వీరాంజనేయ స్వామి ఆలయానికి పాదయాత్రగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చంద్ర రెడ్డి ఆలయ అర్చకులు రమేష్ పంతులు హజాయ్ జెండా ఊపి పాదయాత్ర ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష స్వాములు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్‌లో బీజేపీ

# నూతన పార్టీ కార్యాలయం ప్రారంభం

### ఎంపీ ఈటలతో కలిసి పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు...

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పార్టీ కార్యాలయాన్ని, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక డివిజన్ నాయకులు ఈటల రాజేందర్ కి ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతన కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించరు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం, ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇది ప్రజల కోసమే పోరాడే పార్టీ అని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఎంతో పురోగతి సాధించిందని రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడ ప్రజలు బిజెపి అవకాశం ఇస్తానని వారు తెలియజేశారు.దఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్.మల్లా రెడ్డి , కూకట్ పల్లీ అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు,అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు,జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు. కార్యాలయం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించలని స్థానిక నాయకులకు వడ్డేపల్లి రాజేశ్వరరావు సూచించారు.

# సీఎస్కే గ్రీన్ విల్లాస్ అభివృద్ధికి కృషి

- వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి
- బేకార్ మాటలు వద్దు.. అభివృద్ధికి కలిసి రండి
- సీనియర్ నాయకుడు జమ్రుద్ ఖాన్ పిలుపు
- నియామక పత్రాలను అందజేసిన ఎన్నికల చైర్మన్
- సీఎస్కేలో ఎమ్మెల్యే శంకర్ సహాయ సహకారంతో ప్రగతిలో అభివృద్ధి





సీఎస్కే గ్రీన్ విల్లాస్ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు అప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ తదితరులు స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం షాద్ నగర్ పట్టణంలోని సీఎస్కే గ్రీన్ విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా అప్పి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీగా సోమశేఖర్ ఎన్నుకున్న సందర్భంగా సీఎస్కే గ్రీన్ విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల చైర్మన్ శివరాం ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. సీఎస్కే ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్లను ఆహ్వానించిన క్రమంలో జమృత్ ఖాన్ ప్యానెల్ కు వ్యతిరేకంగా ఎలాంటి నామినేషన్లు రాలేదని దీంతో అప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డినీ అధ్యక్షుడిగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. సీఎస్కే గ్రీన్ విల్లాస్ లో వెల్ఫేర్ అసోసియేషన్కు ఎలాంటి పోటీ లేని కారణంగా ఏకగ్రీవంగా టెక్నాలజీ నలుగురిని ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పలువురు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నేత జమృత్ ఖాన్, మాజీ కౌన్సిలర్ శ్రావణి, సీనియర్ నాయకురాలు రమాదేవి, అబ్దుల్ రబ్జామి, తదితరులు హాజరై నూతన కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్దేశించి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎస్కే ప్రాంత అభివృద్ధి కోసం తన శక్తివంతం లేకుండా కృషి చేస్తానని అన్నారు. తనపై ఎంతో విశ్వాసంతో అందరూ సహకరించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కాలనీ పెద్దలకు అదేవిధంగా జమ్రుద్ ఖాన్, మాజీ కౌన్సిలర్ శ్రావణిలకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ కౌన్సిలర్ శ్రావణి మాట్లాడుతూ జమ్రుద్ ఖాన్ ప్యానెల్ తరపున ఎంపికైన నూతన కార్యవర్గానికి ఆమె అభినందనలు తెలిపారు. జమ్రుద్ ఖాన్ ప్యానెల్ అంటేనే విజయానికి సూచిక అని ఆమె అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో కాలనీని ఎంతో అభివృద్ధి చేశామని తన శక్తివంచన లేకుండా అన్ని పనులు చేసి పెట్టానని ఆమె గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువస్తామని ప్రకృతి పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

**నూతన కమిటీ ఇదే..**

సీఎస్కే గ్రీన్ విల్లాస్ అధ్యక్షుడిగా అప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి జనరల్ సెక్రెటరీగా సోమశేఖర్ కోశాధికారిగా సాదత్, ఎలక్షన్ కమిటీ సభ్యులు సత్యనారాయణ రెడ్డి రమేష్ బాబు సాయిబాబు రసూల్ గులాం తదితరులు ఎన్నికలో ఎంపికయ్యారు.

**గ్రీన్ విల్లాస్ అభివృద్ధికి కృషి**

సీఎస్కే గ్రీన్ విల్లాస్ అభివృద్ధికి శత్రువు లేకుండా కృషి చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జమ్రుద్ ఖాన్ తెలిపారు. సీఎస్కే గ్రీన్ విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ కు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని స్పష్టం చేశారు. తన ప్యానెల్ లో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎస్కేలో అధికారికంగా ఏర్పాటుచేసిన ఈ కమిటీ ఇకపై పనిచేస్తుందని తెలిపారు.

**వృధా మాటలు వద్దు పనులు చేసి చూపించండి**

సీఎస్కే గ్రీన్ విల్లాస్ లో కొందరు అర్థం పడటం లేని మాటలు మాట్లాడుతున్నారని అలాంటి బెకర్ మాటలు పట్టించుకోమని జమ్రుద్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాలనీలో ఐక్యతను పెంపొందించే విధంగా తాము కృషి చేస్తే కొందరు వాటిని విచినం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని జమ్రుద్ ఖాన్ తెలిపారు. కాలనీలో జరిగే అసోసియేషన్ ఎన్నికల్లో పాల్గొనకుండా వేరే కుంపటి పెట్టడం అర్థం పర్థం లేని ఆలోచన అని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో కలిసి వస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అనవసర రాద్ధాంతం చేస్తే వారికే నష్టమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహాయ సహకారాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన సూచన సలహా మేరకు విల్లాస్ ప్రాంతంలో అభివృద్ధి పురోగతిలో ఉందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ముంతాజ్ బేగం, మాజీ అధ్యక్షులు అబ్దుల్ రంజామి, మాజీ అధ్యక్షులు యూసుఫ్ బామాస్, మాజీ కౌన్సిలర్ శ్రావణి, జమ్రుద్ ఖాన్, బ్రహ్మారెడ్డి, కృష్ణ, వరప్రసాద్, ఏం కేసింగ్, శ్రీనివాస్, రంజిత్, సుధాకర్ రెడ్డి, శ్రీశైల, ప్రభాకర్ రెడ్డి, సుభాష్ కుమార్, బాలు, వేణు, షాకిబ్, ఇఫ్తాకర్, రాజా, యూనిస్, ఇమ్రాన్, సుబ్రహ్మణ్యం, జావేద్, చల్మారెడ్డి, ఉపేంద్ర, రాజసింగ్, రాజేష్ శర్మ, కిషోర్ షా, అఫ్జల్ ఆనంద్ కుమార్, మల్లేశ్వరరావు, ఉమాకాంత్, శ్రీరామమూర్తి, గోపాల్ రెడ్డి, కన్నప్రసాద్, షేక్ నయుం పాషా, గోపాలకృష్ణ, భగవాన్, రాధాకృష్ణ, మురళి, జనార్దన్ రెడ్డి అలీమ్ భాష ఇబ్రహీం, శ్యామ్ కుట్టి, రాజేష్ ఉపాధ్యాయ, నాసర్, ఆరిఫ్, డాక్టర్ దిలీప్ చంద్ర, డాక్టర్ వెంకటరత్నం, వెంకటరమణ, చంద్రశేఖర్, అసత్, డాక్టర్ కల్పనా రెడ్డి, శ్రీ తేజ్, డాక్టర్ ప్రశాంత్ కుమార్ తదితరులు హాజరయ్యారు.



# శంకర్పల్లిలో మిస్టర్ చాయ్ డ్యూడ్ ఫ్రాంచైస్‌నీ ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య




తెలుగు వెలుగు మే 18

యువత స్వయం ఉపాధిలో రాణించాలని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య కోరారు. శంకర్పల్లి మున్సిపాలిటీలోని చేవెళ్ల రోడ్లో ఈరోజు మిస్టర్ ఛాయ్ డ్యూడ్ ఫ్రాంచైస్ నీ ఆయన ప్రారంభించారు.యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ కాలాన్ని వృధా చేసుకోకుండా ఎవరి అభిరుచి మేరకు వారు,ఎవరి శక్తి సామర్థ్యాల మేరకు, వారు వారికి ఇష్టమైన స్వయం ఉపాధిని చేపట్టి, వారితోపాటు ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెంది జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు.మిస్టర్ డ్యూడ్ చాయ్ ఫ్రాంచైస్ నీ స్వయం ఉపాధిగా ఎంచుకున్న ఓనర్స్ శేరి లతా లక్ష్మారెడ్డి,అరుణ సంజీవరెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి చిరకాల మిత్రుడు వారికి చేదోడు వాదోడుగా నిలచిన ఉపాధ్యాయుడు, మరియు సామాజిక కార్యకర్త మర్పల్లి అశోక్ నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో శంకర్పల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్,పట్టణ ప్రముఖులు కాసెట్టి మోహన్,కోడి లింగం, మొగులయ్య,రాము పంతులు,దోబీపెట్ చంద్రయ్య,శకుంతల పాల్గొన్నారు. అనంతరం అతిథులుగా శంకర్పల్లి మండల మాజీ ఎంపీపీలు ధర్మనోళ్ళ గోవర్ధన్ రెడ్డి,చిన్న నరసింహులు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మనోళ్ళ వెంకటరెడ్డి,శంకర్పల్లి మాజీ సర్పంచ్ భీసోళ్ల శ్రీధర్,మరియు ఏనుగు వినోద్ రెడ్డి,మాల బాలయ్య,మల్లెపూల శంకరయ్య,మాధవరెడ్డి వెంకట్ రెడ్డి, సోమశంకర్,రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



## శుభకార్యాలు వివాహ వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి

కూకట్పల్లి లోని పలు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన శుభకార్యాలు పెళ్లి వేడుకల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. కెపిహెచ్బి లోని శ్రీకన్య కంఫర్ట్ హొటల్లో జరిగిన గాగన్ కుమార్ రెడ్డి, రాసిల వివాహ వేడుకలో నాను మోహన్ రెడ్డి ఆహ్వానం మేరకు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను అభినందించి ఆశీర్వదించారు. అలాగే అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ లో గల చంద్ర గార్డెన్స్ లో జరిగిన కావలి యాదగిరి, ఉషారాణి దంపతుల కుమారుడు శ్రీధర్ కోడలు శ్వేతల వివాహ వేడుకల్లో వడ్డేపల్లి పాల్గొని వధూవరులను ఆశీర్వదించి అభినందించారు.

## పాతబస్తీ అగ్ని ప్రమాదం పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కృష్ణ యాదవ్ హైదరాబాద్

తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి


పాత బస్తీలోని గుల్జార్ హౌస్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందడంపై టీజీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం బి కృష్ణ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతులలో చిన్న పిల్లలు, మహిళలు ఉండటం చాలా బాధాకరమని అన్నారు. గాయాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆయన సూచించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ఆయన ప్రార్థించారు.

## చిత్తారమ్మ దేవాలయాన్ని సందర్శించిన ఆలయ కమిటీ సభ్యులు

తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి



శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు దేవాదయ శాఖ పరిధిలోని శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ తల్లి ఆలయాన్ని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పండితులు శ్రీనివాస్ నూతన కమిటీ సభ్యులకు స్వాగతం పలికి కండువాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సభ్యులు మాధవరం శ్రీనివాస్ రావు (టాకిల్) మేకల సుదర్శన్, తీగల కృష్ణారావు,చెదురువల్లి శ్రీనివాస్, చేరుకులరాజు యాదవ్, అరిగె శ్రీనివాస్, గౌండ్లలా రవీందర్ గౌడ్, ముసలి బాలరాజ్, అంకెనపల్లి రాము, తూర్పటి కృష్ణవేణి, విద్యాకల్పన, బాషుపాక నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## జేఎన్టీయూ హెచ్ పీహెచ్‌డీ నోటిఫికేషన్‌పై విద్యార్థి సంఘాల ఆందోళన...

**నోటిఫికేషన్ విడుదలను జూలైకి వాయిదా వేయాలి**

**బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు ధరావత్ వినోద్ నాయక్ డిమాండ్**

తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి



జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ హెచ్)లో ఈ నెల 21న విడుదల కానున్న పీహెచ్‌డీ నోటిఫికేషన్‌పై విద్యార్థి సంఘాలు అభ్యం తరం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఎంటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు తుదిదశ ప్రాజెక్టుల నిర్వప ాణలో నిమగ్నమై ఉన్నారని, ఇలాంటి సమయంలో అకడమిక్ రెగ్యులేషన్ లేకుండానే నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు ధరావత్ వినోద్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జేఎన్టీయూ హెచ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ డాక్టర్ బాలు నాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు వినోద్ నాయక్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నోటిఫికేషన్‌ను జూలై నెల లేదా కోర్సులు పూర్తయిన అనంతరం విడుదల చేస్తే, ఎంతోమందికి లాభకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అకడమిక్ సంవత్సరం నడుమ విడుదలైన నోటిఫికేషన్ కారణంగా విద్యార్థులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


# గుర్తు తెలియని వృద్ధుడు మృతి

## షాద్ నగర్ పోలీసుల వెల్లడి

వృద్ధాప్యం కారణంగా తాను వేసుకున్న బట్టలు ముళ్ళకంచెకు తట్టుకోగా అక్కడినుండి బయటపడలేక ఆయాసపడుతూ వృద్ధుడు మృత్యు వాత పడిన సంఘటన షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. షాద్ నగర్ మున్సిపాలిటీ సోలీపూర్ శివారులో ఎస్ఎస్ఎం వెంచర్ లో ఫెన్సింగ్ కడీల పక్కన గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి పడి ఉండటాన్ని గ్రామానికి చెందిన సింగపాగ చంద్రయ్య గుర్తించాడు.

వెంటనే ఈ విషయాన్ని గ్రామ మాజీ డిప్యూటీ సర్పంచ్ ఆంజనేయులుగౌడ్ తో పాటు గ్రామస్తులకు తెలుపగా అక్కడికి వెళ్ళిన వారు మృతదేహాన్ని చూసి అతడు చనిపోయి సుమారు రెండు నుండి మూడు రోజులు గడచి ఉండొచ్చని భావించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 70నుండి 75 సంవత్సరాల మధ్య ఉండవచ్చని తెలుపు రంగు ఫుల్ షర్ట్, నీలి రంగు నిక్కర్, నడుముకి తెలుపు రంగు టవల్ కట్టుకుని ఉన్నాడని, మృతుడు తెల్లటి వెంట్రుకలు కలిగి ఉన్నట్లు మృతదేహం పక్కనె పింక్ కలర్ టవల్ పడివుండటాన్నీ గుర్తించారు. మృతదేహం పూర్తీగా కుళ్లిపోయి ఉంది. షార్ట్ కట్ రహదారిలో నడుచుకుంటూ వెళ్లిన వృద్ధుడు ఫెన్సింగ్ కంచె దాటే క్రమంలో తన బట్టలు వాటికి తగిలిపోగా వృద్యాప్యం కారణంగా వదిలించుకోలేక అక్కడే నిస్సహాయ స్థితిలో మృతి చెంది ఉంటాడని బావిస్తున్నారు. ఈ విషయమై మాజీ డిప్యూటీ సర్పంచ్ ఆంజనేయులుగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రూప్-1పై పోరాటం ఆగదు






గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్తుంటే.. కేసీఆర్ ప్రభుత్వాన్ని మించిన సంక్షేమ సర్కారును తీసుకొస్తారేమోనని ప్రజలంతా ఆశించారు. కానీ, రేవంత్‌రెడ్డి నేతృతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను కాలదన్ని తెలంగాణలో ఇందిరమ్మ ఎమర్జెన్సీ రాజ్యాన్ని తీసుకొచ్చింది. ఈ నయా ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ విధ్వంసం జరుగుతున్నది. ప్రశ్నించినవారిపై దాడులు, అక్రమ కేసులు, నిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయి. తాజాగా టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై ప్రశ్నించిన నాపై కేసు పెట్టారు. గ్రూప్-1 పోస్టుల భర్తీలో జరిగిన తప్పులను ఎత్తిచూపిన నెల తర్వాత కేసు పెట్టడం రేవంత్ సర్కారుకే చెల్లింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలోనే 2 లక్షలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆ పార్టీ నాయకులు ఎన్నికలకు ముందు ఊరూరా ఊదరగొట్టారు. యువత, నిరుద్యోగుల భుజాలపై మూడు రంగుల జెండాలను మోపి, వారి కష్టాన్ని నిచ్చెనగా మార్చుకొని రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠంపై కొలువయ్యిండు. ఏరు దాటే దాక ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడ మల్లన్న అన్నట్టుగా అవసరం తీరాక తెప్ప తగలేశారు. కాంగ్రెస్ జెండాలు మోసి మోసి యువత భుజాలపై అయిన పుండ్లపై కారం చల్లారు. కొత్త గా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోగా.. దేశంలో ఎక్కడా లేని విధంగా కొలువులు వద్దని ధర్నాలు, రాస్తారోకోలు రాష్ట్ర యువత చేస్తున్నారని ఊరూవాడా చాటింపు వేస్తున్నారు. అంతకుముందు నిరుద్యోగ భృతి వట్టి మాటేనని ఉపముఖ్యమంత్రి భట్టి తేల్చేశారు.భారీ గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పి, గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 503 పోస్టులకు 60 పోస్టులను కలిపి తమ ఘనతగా ప్రచారం చేసుకున్నది. క్రెడిట్‌ది ఏముందిలే.. యువతకు కొలువులు వస్తే చాలని అనుకున్నాం. కానీ, కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చి, పోస్టులు పెంచుతామని చెప్పి.. పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించలేకపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, టీజీపీఎస్సీ ఉదాసీనత కారణంగా గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదటి నుంచి తప్పులతడకగా మారింది. లక్షల మంది అభ్యర్థులు రాసే నీట్, ఎప్‌సెట్ లాంటి పరీక్షలకే బయోమెట్రిక్ పద్ధతిని అమలు చేస్తుండగా, వేల మంది మాత్రమే రాసిన గ్రూప్-1 పరీక్షకు మాత్రం బయోమెట్రిక్ హాజరు లేకపోవడం విస్మయం కలిగిస్తున్నది. నోటిఫికేషన్‌లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తామని టీజీపీఎస్సీ స్పష్టంగా పేర్కొన్నది. కానీ, ఆ తర్వాత తమ అస్మదీయులకు అయాచిత లబ్ధి చేకూర్చేందుకే బయోమెట్రిక్‌ను బుట్టదాఖలు చేసింది. అందుకే పరీక్ష ముగిసిన వెంటనే 21,075 మంది అభ్యర్థులు పరీక్ష రాశారని పేర్కొన్న టీజీపీఎస్సీ.. ఆ తర్వాత 10 మందిని అక్రమ మార్గంలో చేర్చింది. ఆ పదిమంది పెరగడం నిజమేనని హైకోర్టు సాక్షిగా అంగీకరించిన టీజీపీఎస్సీ.. వారు ఏ ప్రాతిపదికన పెరిగారనే విషయంపై మాత్రం నోరు మెదపడం లేదు. అంతేకాదు, 20,161 మంది పరీక్షలు రాసినట్టుగా ఒకానొక సమయంలో అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్నది. హాల్‌టికెట్ల విషయంలోనూ అనుమానాలకు తావిచ్చే విధంగా గందరగోళం సృష్టించింది. ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్, మెయిన్స్‌కు మరో హాల్‌టికెట్ ఇవ్వడం వెనుక కూడా ఏదో కుట్ర దాగి ఉన్నది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 మహిళా కళాశాలల్లో గ్రూప్-1 పరీక్షలు జరగగా.. కోఠిలోని ఐలమ్మ మహిళా కళాశాల పరీక్షా కేంద్రంలో మాత్రమే ప్రత్యేకంగా మహిళా అభ్యర్థులను కేటాయించారు. ఇక్కడ రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా సుమారుగా 563 మంది పరీక్ష రాసినట్టు తెలుస్తున్నది. అయితే, ఎక్కడా లేని విధంగా ఈ ఒక్క పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసినవారిలో సుమారు 10 శాతం మంది అభ్యర్థులు గ్రూప్-1 కొలువులను కొల్లగొట్టారు. ఈ ఒక్క పరీక్షా కేంద్రం నుంచి సుమారు 60-70 మంది వరకు సెలక్ట్ అవ్వగా, ఇతర ప్రాంతాల్లోని 40కి పైగా పరీక్షా కేంద్రాల నుంచి ఒక్కరు కూడా సెలక్ట్ కాకపోవడం విడ్డూరం. కాంగ్రెస్ నేత రాములు నాయక్ కోడలు కూడా ఐలమ్మ పరీక్షా కేంద్రంలోనే పరీక్ష రాశారు. ఆమె ఎస్టీ క్యాటగిరీలో టాప్ ర్యాంకు సాధించారు. ఈ విషయాన్ని నేను గత నెలలో ప్రెస్‌మీట్ పెట్టి ప్రస్తావించాను. అప్పుడు ఎక్కడో కూడా కులాన్ని కించపరచలేదు. కానీ, కుట్రపూరితంగా నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. గ్రూప్-1 టాపర్లలో చాలామంది ఒకే పరీక్షా కేంద్రంలో, అందులోనూ ఒకే గదిలో పరీక్ష రాసినట్టు అనుమానాలు ఉన్నాయి. అంతేకాదు, హాల్‌టికెట్ నెంబర్‌లోని చివరి ఒక్క అంకె తేడాతో ఒకరి వెనుక ఒకరు కూర్చున్న చాలామంది అభ్యర్థులకు ఒకే విధమైన మార్కులు రావడం కూడా అనుమానాలకు తావిస్తున్నది. మరోవైపు తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగింది. సుమారు 7,800 మంది తెలుగు మీడియం అభ్యర్థులు పరీక్ష రాయగా, 10 శాతం కూడా సెలక్ట్ కాకపోవడం వెనక గల కారణం ఏమిటి? అదే సమయంలో 9 మంది ఉర్దూ మీడియం అభ్యర్థులు పరీక్ష రాయగా, వారిలో ఏడుగురు ఎలా సెలక్ట్ అయ్యారు? దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి? టీజీపీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాన్ని భ్రష్టు పట్టించారు. అందుకే నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి పరీక్షలు జరిగి, ఫలితాల విడుదల వరకు అన్నింటా అవకతవకలు చోటుచేసుకున్నాయి. గ్రూప్-1 కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. పేద విద్యార్థుల తరఫున ప్రశ్నిస్తుంటే ప్రభుత్వ పెద్దలు ఉలిక్కిపడుతున్నారు. ఆ తప్పుల నుంచి తప్పించుకునేందుకే కేసులు పెడుతున్నారు. నిర్బంధాలకు, కేసులకు భయపడకుండా గతంలో ఎన్నోసార్లు పేదలకు అండగా నిలబడ్డా. ఎన్నెన్నో కేసులను ఎదుర్కొన్నా. ఇప్పుడు పేదల విద్యార్థుల కోసం చేస్తున్న పోరాటంలో నమోదైన ఈ కేసు నాకు దక్కిన మరో ఆభరణం లాంటిదే. ఎన్ని కేసులు పెట్టినా అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే ఉంటా. పేద విద్యార్థుల తరఫున నా గళం వినిపిస్తూనే ఉంటా.

# మిథున్ చక్రవర్తికి షాక్ ఇచ్చిన బీఎంసీ..!

ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తికి బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) షాక్ ఇచ్చింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారంటూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మలాడ్‌లోని ప్రాంగణంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారంటూ అధికారులు నోటీసులు పంపారు. అనుమతి లేకుండా గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మెజనైన్ ఫ్లోర్‌ను నిర్మించారని నోటీసులో బీఎంసీ పేర్కొంది.


సాధారణంగా రెండు అంతస్తుల మధ్య పాక్షికంగా నిర్మించే ఫ్లోర్‌ను మెజనైన్ ఫ్లోర్‌గా పేర్కొంటారు. ఇలాంటి నిర్మాణాలతో పాటు, ఇటుక గోడలు, చెక్క పలకలు, గాజు అద్దాలు, ఏసీ షీట్లతో కూడిన పైకప్పుతో 10ఐ10 అడుగుల విస్తీర్ణంలో మూడు తాత్కాలిక నిర్మాణాలను కూడా అనుమతి లేకుండానే చేపట్టారని బీఎంసీ గుర్తించి నోటీసులు జారీ చేసింది. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని.. లేకపోతే బీఎంసీ చట్టంలోని సెక్షన్ 475ఎ కింద చర్యలు తీసుకుంటామని బీఎంసీ తన నోటీసులో స్పష్టం చేసింది. నోటీసులపై మిథున్ చక్రవర్తి స్పందించారు. తాను ఎలాంటి అక్రమ నిర్మాణం చేపట్టలేదన్నారు. చాలా మందికి బీఎంసీ నోటీసులు ఇచ్చిందని.. వారికి సమాధానం పంపుతున్నట్లు పేర్కొన్నారు. బాలీవుడ్ ప్రముఖ నటుడికి అనేక విలాసవంతమైన బంగ్లాలు, హోటల్స్, వ్యవసాయ భూములు ఉన్నాయి. కోల్‌కతాలోని ఇంటితో పాటు, అతనికి ముంబయిలో రెండు బంగ్లాలు కూడా ఉన్నాయి. మిథున్ బాంద్రాలో ఒక ఇల్లు ఉంది. ముంబయిలోని మడ్ ఐలాండ్‌లో 1.5 ఎకరాల భూమిలో విలాసవంతమైన బంగ్లాను నిర్మించాడు. ఆ బంగ్లా విలువ ప్రస్తుతం రూ.45 కోట్లు. ముంబయితో పాటు ఊటీలోనూ ఓ ఫామ్ హౌస్ ఉంది. మిథున్‌కు తోటపని చాలా ఇష్టం. అందుకే తన ఇంటి చుట్టూ చెట్లు, మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించుకుంటున్నారు. ఆయనకు ఊటీలో లగ్జరీ హోటల్స్ ఉన్నాయి. ఆయన మోనార్క్ గ్రూప్ ఆఫ్ హోటల్స్‌కు సీఈవో. ఊటీలోని ఆయన హోటల్ మోనార్క్‌లో 59 గదులు, నాలుగు లగ్జరీ సూట్లు, ఫిట్‌నెస్ సెంటర్, ఇండోర్ స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటకలోని పెద్ద నగరాల్లో లగ్జరీ హోటళ్లు సైతం ఉన్నాయి.

## ఘనంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



గుమ్మడిదల మండలం పరిధిలోని కొత్తపల్లిలో భక్తిశ్రద్ధలతో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యాన్ని గ్రామ పురోహితులు ఆంజనేయ శర్మ గారి ఆధ్వర్యంలో ఆలేటి జగన్మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి గారు విజయవంతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, “ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో సమాజానికి సానుకూల శక్తిని ఇస్తాయి. భక్తి భావం పెరిగే విధంగా ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనలు జరగడం ఆనందకర విషయం. దేవాలయాలు మన సాంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతిబింబాలు. భక్తులు ఇక్కడి దేవాలయాన్ని నిత్యం దర్శించి ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలి” అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, లలితనరసింహారెడ్డి, ఆంజనేయులు,రాజశేఖర్, వేణు, దేవేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, మంగయ్య, సదానందరెడ్డి, గోపాల్,సత్తయ్య, చక్రపాణి, నాగేష్ గౌడ్, వినోద్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి బీసీ ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్



కర్చర్ల ఎల్లేష్ అన్నయ్య గారైన సత్యనారాయణగారి కుమార్తె పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులుబేరీ రామచంద్ర యాదవ్ బృందం. శ్రీజి కర్చెర్ల ఎల్లేష్ శేరిలింగంపల్లి కాంటెస్టెడ్ కార్పొరేటర్ అన్నయ్య సత్యనారాయణ గారి కుమార్తె పెళ్లికి తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షులు రామచంద్ర యాదవ్ బృందం హాజరై వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఎల్లేష్ గారి ఆహ్వానం మేరకు పి.వీ. కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన పెళ్లికి బేరి రామచంద్ర యాదవ్, శ్రీ సదానంద్ యాదవ్, కుమార్ యాదవ్ సత్యనారాయణ యాదవ్ , ఆర్కే సాయన్న ముదిరాజ్ పెళ్లికి హాజరై పెళ్లి కుమార్తె ,పెళ్లి కుమారునికి ఆశీర్వదించి తల్లిదండ్రులను కలిసి ఆనందాక్షణాల్లో ధన్యవాదాలు తెలుపుకోవడం జరిగింది. ఎన్ ఏ ఎన్ ఫంక్షన్ హాల్ లో ఎస్పి గంగారం యాదవ్ గారి కుమారుని పెళ్లికి హాజరై రామచంద్ర యాదవ్ బృందం వధూవరులను ఆశీర్వదించి భోజనాధులను స్వీకరించి రావడం జరిగింది. అడ్వకేట్ రమేష్ గారి అన్నయ్య శ్రీ గంగారాం పోలీస్ డిపార్ట్మెంట్ ఎస్పి గారి కుమారుని పెళ్లికి హాజరై బేరి రామచందర్ యాదవ్, బృందం అందెల సత్యనారాయణ యాదవ్ , అందేలా కుమార్ యాదవ్ ,ఆర్కే సాయన్న ముదిరాజ్ శ్రీశైలం యాదవ్, మారబోయిన సదానంద యాదవ్ వధూవరులను ఆశీర్వదించి సంతోషంగా జీవించాలని భగవంతుని ప్రార్థిస్తూ కోరడం జరిగింది. అడ్వకేట్ రమేష్ యాదవ్ వారి అన్నయ్య గంగారాం యాదవ్ పోలీస్ ఎస్పి గారి ఆహ్వానం మేరకు బెరీ రామచంద్ర యాదవ్ బృందం పెళ్లికి హాజరు కావడం జరిగింది.

## ఎస్సై రాము ఆధ్వర్యంలో ఫోన్ల రికవరీ



నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలానికి చెందిన ప్రజలు పలువురు గతంలో మొబైల్స్ పోయిన విషయమై ఎర్గట్ల పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదులు చేయగా. సి,ఈ,ఐ,ఆర్ పోర్టల్ ధ్వారా పోయిన మొబైల్స్ (04)కనుగోని, ఫిర్యాదులు ఇచ్చినవారికి ఈ రోజు ఎస్సై బి. రాము ఆధ్వర్యంలో వారి ఫోన్లను రికవరీ చేసి వారికి అందించామని ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు బాధితులు పాల్గొన్నారు.

# సకల జనుల హితుడు సంజీవ్ నాయక్

- నిరుద్యోగుల పక్షాన పోరాటాలు చేసిన నాయకుడు...
- టీచర్లు,నిరుద్యోగుల సమస్యలపై,ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం
- నిరుద్యోగుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన చరిత్ర సంజీవ్ నాయక్ ది
- నిరుద్యోగులకు నేనున్నా అంటున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు
-భూక్యా సంజీవ్ నాయక్





**బయ్యారం,మే 18 :**
నిరుపేద కుటుంబంలో పుట్టి,నిరుపేదల బాధలను చూసిన వారి కన్నీళ్లు తుడుస్తూ జీవనం కోనసాగిస్తూ,తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర ఉద్యోగ జేఏసిలో కీలక పాత్ర పోషించిన సంజీవ్ నాయక్ జనం కోసం నేనున్నా అంటూ నేటికీ నిత్యం నిరుద్యోగులకు, ఉద్యోగులకు అండగా సేవలను అందిస్తూ, వారి సమస్యల పట్ల పోరాటాలు చేస్తున్నారు సంజీవ్ నాయక్. 2014 సం,,లో తెలంగాణ రాష్ట్ర పునర్విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ లో విలీనమైనటువంటి ఏడు మండలాల్లో ఉన్న 1648 ఉద్యోగులను,అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు,ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్,విద్యా శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డితో మాట్లాడి ఆ ఉద్యోగులందరినీ స్వరాష్టానికి తెప్పించడంలో భూక్య సంజీవ నాయక్ ముఖ్యపాత్ర పోషించారు. అదేవిదంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్టంలో 2012 సం,,లో కాంగ్రెస్ సర్కార్ ప్రకటించిన మెగా డిఎస్సీ ద్వారా ఉద్యోగాలకు సెలక్ట్ అయినా అభ్యర్థులకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 23 జిల్లాలలో 22 జిల్లాలలో ఉన్న ఉద్యోగార్థులకు జనవరి నెలలో నియామక పత్రాలు అందించారు. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ఏజెన్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ విషయంలో ఏర్పడ్డ సమస్యను అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తో,సెంట్రల్ మినిస్టర్ పోరిక బలరాం నాయక్ తో చర్చించి ఏజెన్సీ అభ్యర్థులకు 2 నెలల్లోనే 275 మందికి నియామక పత్రాలు అందించేందుకు కృషి చేశారు. 2012 సం,,లో ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి (భద్రాచలం) లో కూడా ఏజెన్సీ సర్టిఫికెట్ల విషయంలో ఐటీడీఏ ఉన్నతాధికారులతో మాట్లాడి ఏ సమస్య లేకుండా చేసి 375 మంది ఏజెన్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇప్పించేందుకు సంజీవ నాయక్ కృషి చేశారు. 2015 సం,,లోపిఆర్సి నందు ఏజెన్సీ ప్రాంతంలో ఉండబడినటువంటి ఉద్యోగులకు అడిషనల్ హెచ్ఆర్ఏ ను అందించేందుకు కృషి చేశారు. టిఆర్టి 2017 సం,,లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా మిగిలిపోయినటువంటి ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉండబడిన,ఎస్టీ వికలాంగుల అభ్యర్థులకు,అప్పటి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, సీనియర్ ఐఏఎస్ సందీప్ సుల్తానియాతో చర్చించి వికలాంగుల అభ్యర్థుల సమస్యకు పరిష్కారం చూపించి 151 మందికి ఉద్యోగాలు రావడం కోసం కృషి చేశారు. డీఎస్సీ 2008 లో టిటిసి,బిఈడి 70:30 లో నష్టపోయినటువంటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉండబడిన 64 మంది ఏజెన్సీ అభ్యర్థులకు అప్పటి ప్రభుత్వ ఎడ్యుకేషన్ డైరెక్టర్ తో మాట్లాడి నియామక పత్రాలు అందించడంలో ప్రముఖ భూమిక పోషించిన పోషించారు. సంజీవ్ నాయక్ కృషి వల్ల లబ్ది పొంది ఉద్యోగాలు చేస్తున్న బాలకృష్ణ చౌహాన్,భూక్య బాబూలాల్, నునావత్ బిక్షం, హీరాలాల్, మోతిలాల్ ఉద్యోగ అభ్యర్థులు మాట్లాడుతు నిరుద్యోగులు,ఉద్యోగార్థుల కోసం కృషి చేస్తున్న సంజీవ్ నాయక్ లాంటి నాయకులు ప్రస్తుత సమాజంలో అరుదుగా ఉంటారనీ వారు తెలిపారు.

# పలు పార్టీల నుండి బిజెపి పార్టీలో చేరికలు

**వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**



**ఖానాపూర్, మే 18:**
ఖానాపూర్ మండల బిజెపి అధ్యక్షుడు రాధారపు అశోక్ అధ్యక్షతన నాది తండకు చెందిన బిజెపి నాయకులు అజ్మీర రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ మరియు బి ఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు మూడు కళ్యాణ్, బానోత్ వెంకటేష్, గూగులోత్ నరేష్, ఎల్. ప్రశాంత్, కే వరుణ్, బి శ్రీకాంత్, బి దినేష్, ఎల్ సతీష్, ఏ శశికాంత్, బి దినేష్, ఎల్ సతీష్ కే మోహన్ వీరందరికీ భారతీయ జనతా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటామని మరియు రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానంలో యువతకు ప్రాధాన్యత కల్పించి మెజారిటీ స్థానాల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి నర్సంపేట గడ్డమీద భారతీయ జనతా పార్టీ జెండా ఎగరేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల అధ్యక్షుడు రాధారపు అశోక్, మాజీ మండల అధ్యక్షుడు ఆబోత్ రాజు యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు జల్లి మధు, ప్రధాన కార్యదర్శి కలకోటి సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే 010 ద్వారా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించండి

- ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేత
- కల్వల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయ బృందం






**కేసముద్రం ,మే 18:**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సాదుల శ్రీనివాసు కుమారుడు వివాహానికి హాజరైన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి దానిలో భాగంగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి ద్వారా మోడల్ స్కూల్ సమస్యలు వేం నరేందర్ రెడ్డికి వినతి పత్రం ద్వారా 010 కారుణ్య నియామకాలు హెల్త్ కార్డు వాటిపై లిఖితపూర్వంగా వినతి పత్రం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పరిమి నవీన్ ఉపాధ్యాయులు యాకయ్య సురేందర్ సోమయ్య జిల్లా పిఆర్ టి యు సంఘం ద్వారా అందించడం జరిగింది.. ఈ కార్యక్రమం లో సామల నర్సయ్య,చిలువేరు సమ్మి గౌడ్, శేఖర్ సాయి తదితరు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం

**కేసముద్రం ,మే 18:**
మహబూబాబాద్ కి చెందిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్–నాగమణి ల కుమారుడు ఆకాష్ వివాహము ఆదివారం పి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ మహబూబాబాద్ లో పెళ్లి కుమార్తె అమృత వర్ష తో జరగగా ఈ వివాహ మహొత్సవ వేడుకకు కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం వి. రమణ,గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ లు హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మార్తినేని పాపారావు, చాగంటి కిషన్,సామల నరసయ్య,జయరాజు ఎర్రం శెట్టి అశోక్ సామల శ్రీను రాజానాయక్ తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.



## లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి 50 వేల రూపాయలు విరాళం





**బయ్యారం,మే 18**
బయ్యారం మండలం కంబాలపల్లి గ్రామంలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయా అభివృద్ధికి గంధంపల్లి గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు దేశిని రాంబాబు ఆలయ కమిటీ కి ఆదివారం 50వేల రూపాయలను విరాళంగా అందించారు. వారితో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.అనంతరం కంబాలపల్లి గ్రామ దొర, పటేల్, గ్రామ పెద్దలు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ సభ్యులు దేశిని రాంబాబు ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో దొర మోకాళ్ళ భాస్కర్, పటేల్ చింత కృష్ణ, గ్రామ పెద్ద చీమల చంద్రయ్య, తాటి స్వామి, వాసం వెంకన్న,పోనక రామచంద్ర, సువర్ణపాక బుచ్చిరాములు, మెస్సు శ్రీను, చింత సుధాకర్, మోకాళ్ళ రవి, చీమల సుక్కమ్మ, పొనక పెంటమ్మ, మోకాళ్ళ సువర్ణ, వెంకటమ్మ, పద్మ, సమ్మక్క, గలిగే బుచ్చమ్మ, పద్మ, సుభద్ర, చింత ప్రమీల, గలిగే సరోజన, సువర్ణపాక నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపురంలో విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



**బయ్యారం, మే 18**
బయ్యారం మండలం నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ వైర్లు తెగిపడి పాడి గేదె మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. శనివారం రాత్రి తీవ్రమైన గాలి దుమరానికి కరెంట్ స్తంబాలు నేల కూలడంతో పంట పొలల్లో విద్యుత్ తీగలు నేలపై పడిపోవడంతో అటువైపుగా గేదెలు వెళ్లగా విద్యుత్ షాక్‌తో గేదె చనిపోయింది. కట్టబోయిన మల్లయ్య తన గేదె ఒకటి చనిపోయిందనీ ఇంకా కొన్ని గేదెలు క్షేమంగా బయటికి వచ్చాయని, గేదె చనిపోవడం వల్ల తనకు 70 వేల రూపాయల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.తమకు ప్రభుత్వం తరుపున సాయం అందించాలని బాధితుడు కోరాడు.

## సన్న వడ్లకొనుగోలు చేయడంలో మిల్లర్ల జాప్యం

**ఖానాపూర్ మండలబిజెపి అధ్యక్షుడు రాధారావు.అశోక్**

**ఖానాపూర్, మే18:**



రాష్ట్ర ప్రభుత్వం సన్నలకు బోనస్ రూపంగా క్వింటాకు 500 రూపాయలు చొప్పున చెల్లిస్తామని ఆశ చూపి తీర పంట కోసి కాంటాకు సిద్ధం చేశాక మిల్లర్లు సన్న వడ్లు కొనమని ముక్కు సూటిగా రైతన్నకు చెప్పుతూ అన్నదాతను ఆగం చేస్తున్నారు. ప్రజలను మభ్యపెట్టి సన్న బియ్యం పంట చేసి నేడు కనీసం వడ్లను కొనుగోలు చేయకుండా మిల్లర్ల వద్ద రెండు నుండి మూడు కేజీలను కోత కోస్తూ రైతులను చిన్నచూపు చూస్తూ ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతన్నకు న్యాయం చేయాలని రైతులు బాధ పెట్టడం సరైన పద్ధతి కాదని మీకు చేతనైతే మీరు ఇచ్చిన మాట ప్రకారం తక్షణం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకొని సన్న వడ్లు కొనుగోలు చేసి బోనస్ తో సహా సకాలంలో చెల్లించే విధంగా చూడాలని ఖానాపూర్ మండల బిజెపి అధ్యక్షుడు ఆధారప అశోక్ డిమాండ్ చేశారు.

## గరిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**యాదాద్రి జిల్లా :రామన్నపేట: మే 18**



గరిక ఫౌండేషన్ తరపున ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గరిక సత్యనారాయణ స్థానిక రామన్నపేట లో వనం లలిత చనిపోయిన విషయం తెలుసుకొని , ఆదివారం పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు. అదేవిధంగా దహన సంస్కారాలకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. వీరి వెంట మహమ్మద్ నజర్,జమ్మీరుద్దీన్, ఎండి అక్రమ్, వహీద్, పెద్ద బోయినమని,వనం చంద్రశేఖర్, పల్లపు రవి, గొలుసుల ప్రసాద్, కోట సుధాకర్, లవనం నరేందర్,కొమ్ము శేఖర్, లంకల ప్రవీణ్,ఘటక నవీన్, లవణం సాయి, తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

# ఉచిత పథకాలపై ప్రజలే నిలదీయాలి !



అధికారం కోసం పాలకులు ప్రజలను ఓటు బ్యాంకుగా చేసుకుని పథక రచన చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పథకాలను రూపొందిస్తున్నారు. సంక్షేమం అన్న ముసుగు తగిలించి దేశ, రాష్ట్ర ఖజానాలను గుల్ల చేస్తున్నారు. లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు. ఇలాంటి దుబారా పథకాలను నిలువరించాలి. ప్రజలు కూడా నిలదీయాలి. తమ చేతిక ఇఎముక లేదన్నట్లుగా నగదు జమ చేస్తున్నారు. ఎపిలో అయితే బటన్ నొక్కుడు..నగదు జమచేయడం నిత్యకృత్యంగా మారింది. తెలంగాణలో కూడా గత ప్రభుత్వం దళితబందు, రైతుబంధు వంటి పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టింది. అధికారం పోయాక ఇప్పుడు అవే పథకాలు అమలు చేయాలంటూ ప్రజలను రెచ్చగొడుతోంది. ఇది అభివృద్ధి, సంక్షేమం ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పథకాలపై ప్రజలే నిలదేసేలా చైతన్యవంతులు కావాలి. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదేసే రోజులు రావాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే..పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారం లోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాల హామీలను గుప్పిస్తున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలతో దేశ,రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్, బిజెపిలతో పాటు ప్రాంతీయ పార్టీల నేతలంతా బరి తెగిస్తున్నారు. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్భాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. 75 ఏళ్లు దాటినా ఇంకా పేదల పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇలా నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ఉండడం లేదు. ఉపాధి, ఉద్యోగరంగాలను బలోపేతం చేసే చర్యలు చేయడం లేదు. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. ఉన్న పరిశ్రమాలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మే స్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యంలాంటి పథకాలన్నీ దండగమారివే అయినా కొనసాగి స్తున్నారు. గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ మార్పునకు నాందీప్రస్తావన కావాలి. పేద ప్రజలకు తాము అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్దిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికలవేళ చేస్తున్న వాగ్దానాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెట్‌ను మించి ఉంటున్నా యని, ఇలాంటి జనాకర్షక హామీలు గుప్పించడం తీవ్రమైన అంశమని గుర్తించాలి. గతంలో సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి అభిప్రయామే వెలిబుచ్చింది. ఇకనుంచైనా ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో నిలదీయాలి. తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వానికి అవకాశం లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ఎలా అన్నదే ప్రస్తుతం ఉన్న సమస్య. ఎన్నికలకు ముందు ప్రజానిధులతో ఉచిత తాయిలాలు ప్రకటిస్తూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల ఎన్నికల గుర్తును స్తంభింపజేయాలని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల ముందు మరోమారు ఈ సమస్య చర్చ కావాలి. ఉచితాలపై ప్రజలే నిలదీయాలి. మనకెందుకు లే అని అనుకుంటే మనలను నిండా ముంచుతారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ ఏలుబడే చక్కటి ఉదాహరణ. ఎపిలో జగన్ పాలన కూడా అందుకు ఉదాహరణెలె. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న తీరును ప్రజలు చైతన్యవంతులయి ఎక్కడిక్కడ నిలదీయాలి. ఈ ఎన్నికల్లోపే ఇది చేయగలమా? వచ్చే ఎన్నికల వరకైనా చేయగలమా? అన్నది ఆలోచించాలి. ఉచిత హామీలకు అయ్యే ఖర్చు సాధారణ బడ్జెట్‌ను మించిపోతోందని గతంలో సుప్రీం సిజె గా పనిచేసిన జస్టిస్ ఎన్‌వి రమణ చేసిన వ్యాఖ్యలు మననం చేసుకోవాలి. ఓటర్ల నుంచి రాజకీయ లబ్ది పొందటం కోసం అనుసరిస్తున్న జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని కూడా అప్పట్లో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అంటూ...మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఎన్నికల సంఘానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా తనకుతాను నియమావళిని నిర్దేశించుకుని రాజకీయ పార్టీలను కట్టడి చేయాల్సి ఉంది. అధికారం కోసం... అధికార వనరులపై పెత్తనం కోసం రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలుగా చెప్పుకోవాలి. ఎపిలో నిరంతరాయంగా డబ్బుల పంపిణీ కార్యక్రమం మనకు కళ్లకు కనపడుతోంది. జగన్ తనతాత ముత్తాతలు సంపాదించిన ఆస్తి నుంచి పంచి పెడుతున్నట్లుగా ఎపిలో బొక్కసం ఖాళీ చేస్తున్నారు. కెసిఆర్ కూడా అప్పులతో ఆస్తులు సృష్టించానని చెప్పి తెలంగాణను అప్పుల కుప్పగా తయారు చేశారు. ఈ అప్పులు తేర్చడానికి వేలకోట్లు వడ్డీలకే చెల్లించాల్సి రావడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి నేతలను నమ్మితే మనలను మనం అంగట్లో అమ్ముకోవడం తప్ప మరోటి కాదు. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారం లోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదనలు హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడీతో సహా కెసిఆర్, జగన్, మమత బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సిఎంలంతా ఇందుకు అతీతులు కాదు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడు కోవాలన్న లక్ష్యంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. విద్య,వైద్యం అందకుండా పోతోంది. రవాణా మార్గాలు నేటికీ అభివృద్ధి జరగడం లేదు. ఎన్నికలు వచ్చినపుడల్లా కొత్తకొత్త ఉచిత పథకాలు వచ్చి చేరుతున్నాయి. ఖర్చుల భారం పెరగ డంతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసేస్తున్నారు. అదేమంటే అభివృద్ధికి అప్పులు తప్పవంటున్నారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న ఉచిత పథకాల వ్యాప్తిని చక్కదిద్దేందుకు చర్చించాలి. రాజకీయ పార్టీలను నిలదీయాలి. లేకుంటే వారు మనలను అప్పులకు బాధ్యులుగా చేయగల సమర్థులు.

## మసకబారుతున్న సిబిఐ సమర్థత

### కేసులను తేల్చడంలో నిర్లక్ష్యం

### ఐదేళ్లయినా కొలిక్కిరాని వివేకా హత్యకేసు

**కడప:** సిబిఐ చేపడుతున్న కేసుల్లో ఎన్ని నిజాలు నిర్ధారణ అయ్యాయో తెలియడం లేదు. ఎన్ని కేసులు బయటకు వచ్చాయో తెలియడం లేదు. ఇటీవలి కాలంలో కొన్ని కేసులు మాత్రం కేవలం బెదిరింపులకే పరిమితం అవుతున్నాయి. లిక్కర్ కేసులో నిజాలు రాబట్టలేకపోయారు. అంతెందుకు ఐదేళ్లయినా వైఎస్ వివేకాను హత్య చేసిన వారెవరో తేల్చలేదు. నిర్ధారించలేదు. సరికదా కేసును కొలిక్కి తీసుకుని రాలేదు. ఈ కేసులో ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న వారంతా అమయకులని సిఎం జగన్,సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. సొంత చిన్నాన్న హత్యకేసును కొలిక్కి తేవాలన్న దక్షత కూడా లేకుండా పోయింది. నిజానికి అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం సిఐడిని ఉపయోగించి అనేకానేక కేసులను తవ్వుతూ..అనుమానం ఉన్నవారినల్లా బొక్కలో తోస్తోంది. కానీ వివేకానంద రెడ్డి హత్య కేసులో మాత్రం మిన్నకుంటోంది. ఇక్కడే అందరికీ అనుమానాలు వస్తున్నాయి. సొంత చిన్నాన్న హత్య కేసును ఛేదించలేని చేవ చచ్చిన పాలకుడిగా జగన్ ప్రజల ముందు నిలిచాడు. మానాన్నను చంపినవాళ్లను ఇంకెప్పుడు పట్టుకుంటారని దారుణ హత్యకు గురైన వై.ఎస్. వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి అడిగిన సూటి ప్రశ్నకు నేటికీ సమాధానం దొరకలేదు. సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని స్వయంగా ఆమె ఆవేదన వ్యక్తంచేయడం కూడా జగన్ వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ఈ కేసును హైదరాబాద్‌కు బదలాయించిన తరవాతనే కొంత కదలిక వస్తోంది. అయినా సిబిఐ కూడా దీనిని తేల్చలేక పోయింది. వివేకా హత్యను ఎవరో కానీ చాలా తెలివిగా చేశారని అనిపిస్తోంది. ఎవరికీ చిక్కకుండా ఉంటున్న చిక్కడు దొరకడు ఎవడో సిబిఐ కూడా పట్టుకోలేక పోతున్నది. అంటే పక్కా ప్రణాళికతోనే చేశారని అనుకోవాలి. ఆనవాళ్లు లేకుండా..అనుమానాలు రాకుండా...విచారణలో దొరక్కుండా హత్యను చాలా పక్కగా చేశారని అర్థం అవుతోంది. సిబిఐ కూడా ఈ విషయంలో కూపీలాగ లేకపోతున్నది. మరోవైపు సిబిఐ విచారణలో భాగంగా అవినాశ్ రెడ్డిని విచారించడం తో వైసిపి ఎందుకనో ఉలిక్కిపడుతోంది. అవినాశ్ రెడ్డి అమాయకుడని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. రాజకీయంగా అడ్డు తొలగించుకునేందుకే వివేకాను హత్య చేశారన్న ప్రాథమిక అంచనా అంటూ ప్రచారం సాగుతోంది. ఇది నిజమా కాదా అన్నది సిబిఐ దర్యాప్తులో బట్టబయలు కానుంది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో సిఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, అవినాశ్ రెడ్డిలకు మాత్రం కేసును త్వరగా తేల్చి నిందితులను పట్టుకోవాలన్న పట్టుదల ఎక్కడా కానరావడం లేదు. పులివెందులలో తమ బంధువులు కాకుండా బయటి వ్యక్తులు వచ్చి హత్య చేసే అవకాశమే లేదని కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిపై తనకు అనుమానం ఉందని డాక్టర్ సునీత.. గతంలోనే చెప్పారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఎటూ తేల్చకపోవడంతో సిబిఐ పనితీరుపైనా అనుమానాలు పెరుగు తున్నాయి. నిజానికి వివేకా పట్ల గౌరవం ఉండివుంటే ఈ కేసులో సిఎం జగన్ సీరియస్‌గానే స్పందించి ఉండేవారు. డాక్టర్ సునీత ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం చెప్పవలసి వస్తుందనే మౌనంగా ఉంటున్నారా అన్నది కూడా అర్థం కావడం లేదు. కోడికత్తి కేసు కూడా ఇలాగా నీరుగారి పోతోంది. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వివేకా హత్య కేసును ఛేదిస్తారని అంతా భావించారు. కానీ నీరుగార్చే ప్రయత్నాలను ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చేశారన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. ఎందుకంటే చంద్రబాబు హయాంలో హత్య కేసును దర్యాప్తు చేయడానికి నియమితులైన అధికారులను జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బదిలీ చేశారు. వారిలో కొందరికి పోస్టింగులు కూడా ఇవ్వలేదు. హత్య కేసును నీరుగారుస్తున్నారన్న అనుమానం రావడంతో వివేకా సతీమణి హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త హత్య కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆమె న్యాయస్థానాన్ని వేడుకున్నారు. సీబీఐ దర్యాప్తు విషయంలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తు కోసం హైకోర్టులో పిటిషన్ వేసిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక సీబీఐ దర్యాప్తు అవసరం లేదని ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలు చేయడం జరిగింది. దీంతో కేసును త్వరితగతిన ఛేదిస్తారని అంతా భావించారు. కానీ అలాంటిదేమీ లేకుండా పోయింది. సొంత బాబాయ్‌ని దారుణంగా చంపినవారిని పట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఆధీనంలోని పోలీస్ శాఖ ఎందుకు విఫలం అయ్యిందనేదానికి సమాధానం లేదు. అలాగే హత్య ఎవరు చేశారో..ఎందుకు చేశారో పక్కన పెడితే జగన్‌కు ఇందులో ఆసక్తి లేకుండా పోయిందన్నది వాస్తవం. అందువల్ల ఆయన ఈ కేసును పెద్దగా పట్టించుకోవడం లేదు. వైఎస్ షర్మిల కూడా విచారణ జరగాలని కోరుకుంటున్నారు. దోషులు పట్టుబడాల్సి ఉందంటున్నారు. కానీ కుటుంబంలో ఎక్కడా వివేకానంద మర్డర్‌పై సీరియస్‌గా మద్దతు దక్కడం లేదు. ఈ హత్య కేసులో సిబిఐ విచారణ ద్వారా నిజాలు వస్తాయని భావించినా..సిబిఐ కూడా తేల్చలేకపోయింది.

# దేశ హితం కోసమే ఉమ్మడి పౌరస్మృతి !

ఉమ్మడి పౌరస్మృతి అనగానే రాజకీయపార్టీలు, మత ఛాందసవాదులు గొంతు చించుకోవడం అలవాటు చేసుకున్నారు. ప్రజలందరి రక్తం ఒక్కటే అంటున్న కమ్యూనిస్టులు సైతం ద్వంద్వ నీతిని అవలంబి స్తున్నారు. దురాచారాలను అణచివేసే క్రమంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్న భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతి ఓ ఆవశ్యకతగా గుర్తించాలి. గతంలో ఎన్నో దురాచారాలను మనం రూపు మాపుకున్నాం. బాల్య వివాహాలను రద్దు చేశాం. సతీసహగమనాన్ని రద్దు చేశాం. అలాగే అనేక మార్పులకు ప్రపంచం లోనవు తున్న వేళ ప్రజలకు చట్టం అన్నది ఒకే రకంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి పౌరస్మృతి అంటే మతపరమైన అచారాలు, సంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగం పరిధిలో ఉన్న పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయడం.ఈ దేశంలో పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, పిల్లలను దత్తత తీసుకోవడం, జీవన భృతి లాంటి విషయాలకు సంబంధించి చట్టాలు అందరికీ ఒకేలా లేవు. పౌరులు ఆచరించే మతం, విశ్వాసాల ఆధారంగా వేర్వేరుగా ఉంది. అయితే మతంతో సంబంధం లేకుండా, లింగ భేదాల్లేకుండా భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తింపజేయడమే యూనిఫాం సివిల్ కోడ్. ఈ డిమాండ్ దేశానికి స్వాతంత్యం÷-ర వచ్చిన నాటి నుంచే ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 కూడా ఇదే చెబుతోంది. దేశ పౌరులకు యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకొచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశిక సూత్రాల రూపంలో రాజ్యాంగం సూచిస్తోంది. ఇప్పటి వరకు దేశంలో ప్రజాచట్టాలకు భిన్నంగా మతపరమైన చట్టాలున్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. అయితే ఉమ్మడి పౌరస్మృతిలో ఎవరికి వాళ్లుగా అమలు చేసుకునే చట్టాలు చెల్లవు. దాంతో చాలా కాలంగా దేశంలో మైనారిటీ అయిన ముస్లింలు యూనిఫావ్ సివిల్ కోడ్‌ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఉమ్మడి పౌరస్మృతి అంశంపై చర్చ మొదలయ్యింది. 2019లో ట్రిపుల్ తలాక్‌ని నేరంగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. యూనిఫామ్ సివిల్ కోడ్ వచ్చే దాకా దేశంలో లింగ సమానత్వం సాధ్యం కాదనే వాదనలున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి వల్ల దేశంలో సమానత్వం లభిస్తుంది. కొత్త సమస్యలు పుట్టుకొస్తాయని చెబుతున్న వారంతా కేవలం ఓటు బ్యాంక్ రాజకీయ ప్రయోజనాలు ఆశించేవారుగానే చూడాలి. పౌరులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించేందుకు, అనుసరించేందుకు, వ్యాప్తి చేసేందుకు వీలుంది. దీనిని ఎవరూ కాదనడం లేదు. చట్టం విషయంలోనే మతాల ఆధారంగా ఉండరాదన్నది ఆకాంక్ష. అయితే భిన్న మతాలు, నమ్మకాలున్న భారత్ లాంటి పెద్ద దేశాల్లో ఉమ్మడి సివిల్ కోడ్స్ ద్వారా అందరినీ ఏకం చేయడమనేది ఎంతో కష్టమైన విషయం అన్న వాదన తెస్తున్నారు కొందరు.

హిందువులైనా, ముస్లింలైనా వాళ్లలో వాళ్లకు అనేక భిన్నమైన నమ్మకాలు, విశ్వాసాలు ఉంటాయి. అవి వేరు..చట్టాలు వేరని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మిందువుల్లోనూ భిన్న ఆచారాలు, సంప్రదాయాలు పాటించే వాళ్లున్నారు. ముస్లింలలోనూ షరియా చట్టాలను పాటించని వాళ్లున్నారు. బోరా ముస్లింలు ఆస్తుల వారసత్వం విషయంలో హిందువుల చట్టాలను అనుసరిస్తుంటారు. ఆస్తుల వారసత్వం విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా చట్టాలున్నాయి. ఇక క్రైస్తవులు మెజారిటీగా ఉండే నాగాలాండ్, మిజోరం లాంటి రాష్ట్రాలు తమకంటూ ప్రత్యేకమైన సివిల్ చట్టాలను రూపొందించుకున్నాయి. వాటికి ఆధారం వారి సంప్రదాయాలే గానీ మతం కాదు. గోవాలో 1867 నాటి కామన్ సివిల్ కోడ్ అమల్లో ఉంది. కానీ క్యాథలిక్స్, ఇతర మతస్థులకు భిన్నమైన నియమాలున్నాయి. భారత్‌లో పౌర స్మృతులు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. హిందువుల్లో కొడుకులతో సమానంగా కూతుళ్లకు వారసత్వ ఆస్తిలో వాటా పొందేలా 2005లో చట్టాలను సవరించారు. కానీ దీని కంటే ముందే పలు రాష్ట్రాలు మహిళలకు వారసత్వ ఆస్తిలో వాటా హక్కును కల్పిస్తూ చట్టాలు చేశాయి. ఇలా రాష్ట్రానికో చట్టం, మతానికో చట్టం,ప్రాంతానికో చట్టం ఉండడం వల్ల గందరగోళంగా ఉంది. దీనిని తొలగిస్తే తప్ప దేశంలో ఏకీకరణ సాధ్యం కాదు. ప్రజల్లో ఐక్యత రాదు. ఉమ్మడి పౌరస్మృతి తమ మతంపై, సంస్కృతిపై దాడి అని ముస్లింలు సహా మిగతా మైనారిటీ వర్గాలు చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందకంటే మతం ఆధారంగా చట్టాలు చేస్తూ పోతే ఇప్పటికే దేశం కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజింపబడింది. మతం లాంటి వ్యక్తిగత విషయాల్లో ప్రభుత్వ జోక్యం చేసుకోవాలని ప్రభుత్వం కూడా భావించడం లేదు. గడిచిన 40 ఏళ్లలో భిన్న తీర్పుల్లో భాగంగా దేశ సమైక్యత కోసం యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకు రావాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు సూచిస్తూ వచ్చింది. డెబ్బయి అయిదేండ్ల స్వాతంత్ర్యంలో ఆర్థిక అసమానతలు అంతరించకపోగా పెరిగాయి. సామాజిక అసమానతలు అలానే ఉన్నాయి! స్త్రీలను ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నారు. వారికి గౌరవం దక్కడం లేదు. ఉండటానికి కూడు, గుడ్డ, నీడ సమకూర్చనేలేదు. ఉమ్మడి పౌరస్మృతి అనగానే మతపరమైన అంశమని, అదీ మన ప్రత్యర్థి మతాన్ని నియంత్రించేదన్న ప్రచారం వాడుకలోకి తెచ్చారు. కానీ ఇది అన్ని మతాలకూ, అందరు ప్రజలకూ సంబంధించినది. అందుకనే చాలా జాగ్రత్తగా ఆలోచన చేయాలి. అందరూ సమానంగా వ్యవహరించటానికి మన రాజ్యాంగమూ అందరికీ అన్ని హక్కులనూ కల్పిస్తున్నది. అలాంటప్పుడు చట్టాలు అందరికీ ఒకేలా కాకుండా కొందరికి మరోలా ఉండడం వల్ల సమాజంలో అసమానతలు ప్రబలుతాయి. మీ చట్టం మాకు చెల్లదని ధిక్కరించే సంస్కృతి వస్తుంది. దీనిని అధిగమించి ప్రజలంతా ఒక్కటే..అందరికీ ఒకటే చట్టం అన్న భావన ఉంటే సమానభావం అలవడుతుంది. అందుకు ఉమ్మడి పౌరస్మృతి అవసరమే.

## స్థూలకాయంతో గుండెపై ప్రభావం

### ఆహారపు అలవాట్లు మార్చుకోవాల్సిందే



**న్యూఢిల్లీ :** స్థూలకాయాన్ని వ్యాధిగా పరిగణించాలి. దీని ప్రభావం గుండెపై ఉంటుంది. గుండెపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. గుండె ఆరోగ్యం దెబ్బ తింటే శ్వాస వ్యవస్థ పాడై, శ్వాస పీల్చుకోవడంలో అనేక ఇబ్బందులు పడతారు. గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల ధమనుల్లో ఇబ్బందులు ఏర్పడతాయి. స్థూలకాయం వలన శరీరం బరువు పెరగడంతో కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడతారు. బరువులు ఎత్తినప్పుడు కీళ్లలో నొప్పి మొదలవుతుంది. శరీర బరువు మరింత పెరిగితే, అప్పుడు కీళ్ళపై భారం పడుతోంది. కీళ్లు, పాదాల ఆరోగ్యం చెడిపోకుండా మొదటి నుంచి బరువు అదుపులో ఉంచుకోవాలి.శరీర కొవ్వును ఖచ్చితంగా కొలవడం చాలా కష్టం. బాడీ మాస్ ఇండెక్స్ (బి.ఎం.ఐ) ఆరోగ్యకరమైన బరువును నిర్ణయించడానికి ఒక ప్రసిద్ధమైన మార్గం. భారతదేశంలో బి.ఎం.ఐ 23 కంటే ఎక్కువ ఉంటే, అప్పుడు అధిక బరువుగా పరిగణిస్తారు. అయితే బి.ఎం.ఐ స్థాయి 30 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు ఆ పరిస్థితిని ఊబకాయం అంటారు. ఈ స్థూలకాయాన్ని తేలికగా తీసుకోవడం వల్ల అనేక వ్యాధులకు గురవుతారు. వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరిస్తారు. శరీరంలోని ముఖ్యమైన అవయవాలు కిడ్నీ, కాలేయంలో కొవ్వు పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కొవ్వు ఒక రకమైన ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ కారణంగా కిడ్నీ, కాలేయం పని తీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ అవయవాలు సరిగా పనిచేయలేవు. కొవ్వు పట్టిన కాలేయానికి తగిన చికిత్స చేయకపోతే కాలేయం విఫలమై ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఊబకాయం ఉన్నవారిలో తక్కువ స్పెర్మ్ ఉత్పత్తి అవుతుంది. పెరిగిన శరీరం. చక్కెర అధికంగా ఉత్పత్తి చేస్తూ మధుమేహం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందుకే పిల్లల్ని సాధ్యమైనంతవరకు ఆటల వైపు దృష్టి మళ్లించాలి. పెద్దవాళ్లువ్యాయామం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచిస్తున్నారు.

## వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

### జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న వైద్యారోగ్యశాఖ



**విశాఖపట్టణం:** యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాలులో ఉండే ఆర్‌ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

## కోతుల బెడదతో ప్రజల ఆందోళన

**వరంగల్:** కోతుల బెడద నివారించేందుకు అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచాలని, కోతులను అడవులకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. కోతులు పట్టేవారిని ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పిస్తే గ్రామాల్లో బెడద ఉండదని అంటున్నారు. అలాగే పంటపొలాలకు కూడా నష్టం ఉండదని అంటున్నారు. అయితే కోతులకు అడవుల్లో ఆవాలసాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి గ్రామాల్లో కోతులకు ఆవాసం లేకుండా చేయాలి. అడవుల్లో నేరేడు, సీతాఫలం, వెలగ, రేగు, మారేడు వంటి పండ్ల మొక్కలు నాటాలనిని చెప్పారు. ఇదిలావుంటే అడవుల్లో కోతులకు అనుకూల వాతావరణం కల్పించి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అంటున్నారు. ఏరియాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పెంచుతున్నట్లు గతంలో చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయితే అవేవీ సాధ్యం కాలేదు. ఇదంతా ప్రచారానికి పరిమితం అయ్యింది. ఇప్పటికే అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలు పని చేస్తున్నాయని, అటవీ నర్సరీలు ఉన్న గ్రామ పంచాయతీలు మినహాయించి మిగతా పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కొక్క నర్సరీకి జనాభా, ఇళ్ల సంఖ్య ఆధారంగా 25 వేల నుంచి లక్ష మొక్కలు పెంపకానికి లక్ష్యాలను నిర్దేశిరచినట్లు వివరించారు. అటవీ శాఖకు 40 లక్షలు, గ్రామ పంచాయితీల నుంచి 98 లక్షలు చొప్పన హరితహారం కార్యక్రమానికి మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల్లో 25 శాతం అటవీ పండ్ల మొక్కల పెంపకాన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకంలో భాగంగా హరితహారం ద్వారా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. కానీ కోతుల బెడద నివారణకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.



## అట్టడుగు వర్గాలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

### శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం.అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయ్ ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

## అప్పులతో ఎంతకాలమీ పాలన !

**న్యూఢిల్లీ :** ఉచిత పథకాలతో ఆర్థిక పరిస్థితి ఎలా దెబ్బతిందో చూస్తున్న మనం..ఇంకా అలాంటి వాటి కోసం కక్కుర్తి పడుతున్న రాజకీయనేతల కారణంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపోతే ప్రతిదానికి కేంద్రాన్ని దేబిరించే పరిస్థితి పోవాలి. ఆదాయం ఉన్నమేరకు ప్రణాళికలు ఉండాలి. అప్పులు చేసి, ఉచిత పథకాలను కొనసాగించే దౌర్భాగ్యం సరికాదు. సొంతంగా రాష్ట్రాలను అభివృద్ధి చేసి, ఆదాయాలను సంపాదించి పెట్టేలా చేయాలి. ఉమ్మడి ఎపి నుంచి విడివడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సమస్యలు తీరలేదు. అయినా పాలకుల్లో మార్పు కానరావడం లేదు. ఉచిత పథకాలు వద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. కిలో రూపాయికే సన్నబియ్యం గురించి తెలంగాణ కాంగ్రెస్ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నాటి సిఎం ఎన్టీఆర్ ప్రవేశ కిలో రెండురూపాయల బియ్యం పథకాన్ని ఓటుబ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నారు. దీంట్లో జరుగుతున్న దుబారా పట్టించుకోవడం లేదు. అభివృద్ధిచేయడం ద్వారా సంపద సృష్టించి ప్రజలను స్వయం సమృద్ధిగా బతికేలా చేయాల్సిన నేతలు ప్రభుత్వ ఖాజానాను కొల్లగొట్టి దోచిపెడుతున్నారు. డబ్బుల పందేరం వల్ల అభివృద్ధి ఆగిపోయి..రాష్ట్రం దివాళా తీస్తున్నా పట్టించుకోని నేతల కారణంగా అన్ని రంగాల్లో వైఫల్యాలను చూస్తున్నాం. ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాల్సిన నేతలు పథకాల పేరుతో ప్రజలను ఓటు బ్యాంకుగా తయారు చేసుకుంటున్నారు. ఈ పందేరం అభివృద్ధి పనులపై ఖర్చు పెట్టి ఉంటే ఆయా రంగాలు పురోగమించేవి. కనీస మౌళిక వసతులు సాగు, తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, ఆస్పత్రులపై ఖర్చు పెట్టడం లేదు. వీటికి కేటాయింపులు కూడా తక్కువే. కేవలం పెన్షన్లు, ఉచితబియ్యం ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా అమలవుతున్నాయి. జగన్ హయాంలో బటన్ నొక్కుడుతో రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారు. విశాఖలో ఆకశ హర్మ్యాల లాంటి భవంతులను కట్టుకున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు డబ్బులు వృధా చేశారు. అప్పనంగా డబ్బులు వెనకేసుకున్నారని ఆరోపిస్తున్న ప్రస్తుత పాలకులు వీటిపై నిజాయితీగా విచారణ జరిపించి, శిక్ష పడేలా చేయలేక పోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి చేసివుంటే కనీసం నిరుద్యోగం తీరేది. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందేది. తన ఓటు బ్యాంకు కోసం పాలకులు రాష్ట్రాలను అప్పుల కుప్పగా చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. ఎన్ని కుటుంబాలకు నగదు బదిలీ చేశామన్నది కాదు. ఎంతగా అభివృద్ధి సాధించామన్న లెక్కలు తీయాలి. ఇకపోతే పరిశ్రమలకు ప్రాణాధానం విద్యుత్. వేసవి వచ్చే వరకు ఎంత వినియోగం ఉంటుందో లెక్కలు వేయలేక పోతున్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం లేదా..ఉత్పత్తి ఉన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం లాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం అసమర్థతకు నిదర్శనం. నిజానికి విద్యుత్ ఉంటేనే అడుగు ముందుకు పడే రోజుల్లో ఉత్పత్తిపై వ్యూహం లేకపోవడం దారుణం. కరెంట్‌పై ఖర్చు అన్నది ఉత్పత్తికి, ఉపాధికి బాట వేస్తుందని గుర్తించడం లేదు. కేంద్రంలోని మోడీ కూడా దీనిని పట్టించు కోవడం లేదు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు వాతలు పెడుతున్నాయి. భారీగా పెరిగిన చార్జీలతో గృహ వినియోగదారులకు షాక్ తగులుతోంది. ఇకపోతే బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారంఏటేటా తగ్గుతోంది.

## ప్రజా సమస్యలపై పోరాడేదెవరు ?




**న్యూఢిల్లీ :** దేశంలో సమస్య ఏదైనా ఉద్యమించాల్సిన అసవరం ఏర్పడింది. ఆయా వర్గాలు తమ అవస్థలను తెలియ చేసేందుకు ఎక్కడిక్కడ ఉద్యమ రూపంలో ప్రభుత్వాలకు తెలియచేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పార్లమెంట్, అసెంబ్లీలు అధికార పార్టీ, విపక్షాల సొంత ఎజెండాలతో నడుస్తున్నాయి. కేంద్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు, ఆయా రాష్ట్రాల్లో పాలక,ప్రతిపక్షాలు కూడా సొంత ఎజెండానే అనుసరి స్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరగడం లేదు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై అందరిదీ ఒకటేదారి. ఈ క్రమంలో జాతీయస్థాయి ఉద్యమం చేస్తేనే విపక్షాలను ప్రజలు నమ్ముతారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన అందిస్తేనే ఇది సాకారం అవుతుంది. తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై యుద్దానికి కదిలినా ప్రజలు నమ్మరని గుర్తించాలి. ఇడి కేసులపై ధర్నాలు చేస్తున్న కాంగ్రెస్ కూడా అసలు ప్రజా సమస్యలపై పోరాటం చేయడం లేదు. కేవలం తన రాజకీయ లబ్దికి అవసరమైన విషయాలపైనే పోరాటాలను, విమర్శలను ఎంచుకుంటోంది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి ఉద్యమం చేయడానికి అడపాదడపా లెఫ్ట్ పార్టీలు రంగంలోకి దిగుతున్నా..వాటి బలం చాలడం లేదు. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలతో పాటు, దాని అనుబంధ సంస్థలు,కార్మిక సంఘాలు వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో సమస్యలను ఆధారం చేసుకుని ఉద్యమిస్తున్నాయి. ఈ దశలో ఇక ఉమ్మడిగా పోరు చేయడానికి అన్ని పార్టీలను కలుపుకుని పోవడానికి సిద్దం కావాలి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితుల కారణంగా కొంత వెనకడుగు తప్పడం లేదు. బెంగాల్లో మమతపై పోరాటం చేస్తున్న లెఫ్ట్ పార్టీలకు కాంగ్రెస్‌తో కలసిపోరాడలేక పోతున్నాయి. కేరళలో కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయితే స్థూలంగా స్థానిక సమస్యలపై పోరాటాలు చేసేలా ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడం అసవరమని అన్ని పార్టీలు గుర్తించాలి. అయితే ఆయా పార్టీల్లో ఉన్న అనైతక్యతను క్యాష్ చేసుకోవాలని బిజెపి ఊస్తోంది. విపక్ష పార్టీలు పాలిస్తున్నా రాష్ట్రాల్లో నేతల అవినీతిపై కూడా బిజెపి కాచుకుని కూచుంది. ఇవన్నీ కూడా బిజెపికి కలసివచ్చేలా ఉన్నాయి. అయితే సమస్యల ఆధారంగా పోరాడాలని వివిధ పార్టీలు ముందుకు వస్తే ప్రజల మద్దతు తప్పకుండా లభిస్తుంది. ప్రధానంగా రైతాంగ, కార్మిక సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం దేశంలో ఏర్పడింది. ఎందుకంటే పెట్రో, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు వంటివాటిపై పోరాడాల్సిన అసవరం నిరంతరంగా ఉంది. ఉత్తరాదిలో పది రాష్ట్రాల్లో రైతులు ఆందోళనకు దిగి కేంద్రానికి ముచ్చెమటలు పట్టించారు. గతంలో తమిళనాడు రైతులు కూడా ఢిల్లీ వేదికగా ఆందోళను దిగారు. అయితే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యింది. సాగుచట్టాలను వెనక్కి తీసుకున్నా రైతు సంక్షేమానికి ఒక్క గట్టి నిర్ణయం కూడా తీసుకోలేదు. దీనిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నా..వారిలో నిజాయితీ కానరావడం లేదు. మోడీ పదేళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు దిగజారాయి. దేశంలో 50 శాతంపైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ హామీలు అటకెక్కాయి. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. గత పదేళ్ల యూపిఎ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందన్న ఇమర్శలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు. దేశంలో రైతుల వద్ద భూములను వివిధ పరిశ్రమల అవసరాల కోసం బలవంతంగా లాక్కొంటున్న తీరును ఎండగట్టాల్సి ఉంది. దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోంది. ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కులగణన కూడా కేవలం రాజకీయ లబ్ది కోసం తప్ప మరోటి కాదు. నిరుద్యోగం పెరిగింది. ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. విద్యా, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ బలంగా నాటుకుంది. కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వ పాలనలోకి చొచ్చుకొచ్చేందుకు తలుపులు తెరిచారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదు. ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయి. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ప్రజలు గుర్తించారు. ఈ మేరకు దగాపడ్డ వర్గాలను కలుపుకుని ఉద్యమించేందుకు ఉద్యుక్తులు కావాల్సి ఉంది. ప్రజలే తమ సమస్యలను ఎజెండాగా చేయాలి. ఆయా రంగాల్లో ఉన్న వారిని గుర్తించి సమస్యలపై జాతీయస్థాయి పోరాటాలు ఉధృతం చేయాలి. ఇందుకు కలసివచ్చే రాజకీయ పార్టీలను కూడా కలపుకుని పోవాలి. ట్రంప్ సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆర్థివేత్తలు అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం మరింత పెరుగుతోంది. పెరిగిన ధరల వలన కొనుగోలు శక్తి తగ్గుతోంది. పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించకపోవడం వలన రవాణాఛార్జీలు పెరిగి ధరలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. విపక్షాలు ఇప్పుడు ఈ సమస్యలపై దృష్టి సారించాలి.

## కుట్రదారులను పట్టుకోవాల్సిందే !

**న్యూఢిల్లీ :** 2008 ముంబయి దాడుల కుట్రల వెనక ఎవరెవరు ఉన్నారన్నది బయటకు రావాల్సి ఉంది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేం ఉన్నట్లు భారత్ గట్టి ఆధారాలు సేకరించినా పాక్ తోసిపుచ్చింది. అయితే ప్రపంచం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ విజయం సాధించింది. కసబ్ తదితరులను ఉరితీసాక కూడా పాక్ ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచ వేదికలపై భారత్ ఎండగడుతూనే ఉంది. ఇదే క్రమంలో పాక్‌కు కూడా గట్టిగా బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. గతంలో పాలకులు పాక్ పట్ల నిర్లిప్తంగా వ్యవహరించారు. ఎన్నిమార్లు అవకాశాలు వచ్చినా వదిలేశారు. అవే ఇప్పుడు మనకు శాపంగా మారాయి. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి తదితర సందర్భాల్లో పాక్‌ను తుదముట్టించివుంటే ఇవాళ ఈ దుర్గతి పట్టేది కాదు. తాజాగా ఇప్పుడు తహవ్వుర్ రాణాను రప్పించడంలో భారత్ కృషి మరువలేనిది. ఇదే సందర్భంలో రాణా నుంచి వివరాలు సేకరిస్తే..ముంబై దాడుల వెనక ఉన్న పెద్ద తలకాయల పేర్లు బయటపడగలవు. అయితే రాణా అంత సులువుగా బయటపడతాడని అనుకోవడానికి లేదు. ఇకపోతే భారత్ పట్ల నరనరాన వ్యతిరేకతను నింపుకున్న రాణా ముంబై దాడుల కోసం ఎంతగా తెగించాడన్నది ప్రపంచ దేశాలతో పాటు పాక్‌కు కూడా అర్థం అయివుంటుంది. ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిని గుర్తించి ఇరికించడం లో ఎన్ఐఎ తీవ్రంగా కృషి చేసింది. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దుల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు కావడం, తరవాత ఉగ్రవాదులు గా మారడం గమనించాలి. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నందున వీరిద్దరూ ఇక్కడ చేరారు. తరవాత మిత్రులుగా మారారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. డేవిడ్ హెడ్లీ పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి పుట్టాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ-రాణా మిత్రులుగా మారారు. అక్కడి నుంచే వారి ఉగ్రరచనలకు బీజం పడిందని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికా లోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించేవాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు- అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరెంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోను తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలు చేశాడని బహిర్గతం అయ్యింది. 2006 నుంచి ముంబయి దాడులకు కుట్ర రచన మొదలైంది. ఇవన్నీ కూడా ఎన్ఐఎ సేకరించగలిగింది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐకు పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడని ఎన్ఐఎ పసిగట్టింది. దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడని ఎన్ఐఎ గుర్తించింది. అతడు చేసిన సాయానికి ప్రతిగా..పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చాడు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ-రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయ వంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందిం చాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని కూడా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా.. తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉన్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను కూడా డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా.. భారత్‌లో ముంబై దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ కూడా సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో రాణాకు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది.

# బీసీ వాదం ఇప్పుడు వీస్తున్న గాలి



అధికార పార్టీ సామాజిక కులగణన నిర్వహించిన తర్వాత ఎవరి శాతం ఎంతో తెలిసిపోయింది. ఆయా కులాలకు ఎవరి వాటా ఎంతో అవగతం అయింది. ఈ గాలి త్వరలో రాజకీయ తుఫానుగా మారే సంకేతాలను ఇస్తున్నది. వెనుకబడిన కులాలకు ఒక ఆశాకిరణంలా కనపడుతున్నది. ఇప్పటిదాకా 'బడితె ఉన్నోడిదే బర్రె' అన్నట్టు అన్ని పార్టీలు తమ తమ కులాల ప్రాతిపదికన టికెట్లు ఇచ్చాయి. పైకి సామాజిక సమతూకం అంటూనే తీరా చూస్తే అధికార వర్గానికి అగ్ర తాంబూలం ఇచ్చాయి. అంతవరకు చెప్పిన మాటలన్నీ ఎన్నికల సమయానికి మర్చిపోయి బీసీలకు మొండి చేయి చూపించాయి. ఈ పరిస్థితిలో మంచికో చెడ్డకో, ఇష్టం ఉన్నా లేకున్నా, ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ తెలంగాణలో కులగణనకు శ్రీకారం చుట్టి పూర్తి చేసింది. ఈ చర్య క్రమంగా అన్ని రాజకీయ పార్టీలలో బహుజనులను ఏకం చేసే విధంగా సామాజిక విప్లవాత్మక మార్పుగా పరిణమించనున్నది. ఇటీవల దేశంలో ఏర్పడిన కొన్ని పరిణామాల నేపథ్యంలో ప్రాంతీయ, జాతీయ స్థాయిలలో ఆయా పార్టీలు తమ మూల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవలసిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. రాహుల్‌గాంధీ దేశమంతా చేసిన పాదయాత్ర సామాజిక కులగణనను రాజకీయ పార్టీల ఎజెండా మీదికి బలవంతంగానైనా తెచ్చింది. దీని ప్రభావం గత ఏడాది పార్లమెంటు ఎన్నికల ఫలితాలపైన కనపడింది. అలాగే తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడి వాక్చాతుర్యంపై, ఇచ్చిన వాగ్దానాలపై విశ్వాసంతో ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. కాంగ్రెస్ తన హామీలలో ప్రధాన భాగమైన సామాజిక కులగణనను చేపట్టి పూర్తి చేసింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ఆమోదించింది. దేశంలోనే ఎస్సీ వర్గీకరణను చట్టం ద్వారా అమలు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం ఖ్యాతిని ఆర్జించింది. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థలలో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అధికారికంగా ఇవ్వడానికి సంకల్పించింది. ఈ విధంగా భవిష్యత్తులో జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్యమ రూపు దాల్చడానికి రోడ్డు క్లియర్ చేసింది. ఇన్నాళ్ళూ నివురుగప్పిన నిప్పులా ఉన్న వెనుకబడిన వర్గాలు త్వరలో తమ హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ముందెన్నడూ లేనంత ఒత్తిడి పెంచనున్నాయి.


# ఆపరేషన్ సిందూర్

## శత్రుదేశానికి గట్టి హెచ్చరిక



'ఆపరేషన్ సిందూర్ లక్ష్మణరేఖ – ఇంకోసారి దాడి చేస్తే చొరబడి మరీ అంతు చూస్తాం'... పాకిస్థాన్ సరిహద్దుకు దగ్గరగా, తాము నాశనం చేశామని పాకిస్థాన్ ప్రకటించుకున్న అదంపూర్ ఎయిర్‌బేస్ వేదికగా, పాకిస్థాన్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన హెచ్చరిక ఇది. ఓ వైపు పాకిస్థాన్ డ్రోన్లను, మిస్సైళ్లను నేలకూల్చిన %ూ-%400, మరోవైపు బ్రహ్మోస్‌తో పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను పనికి రాకుండా చేసిన సుఖోయ్ యుద్ధ విమానం ఉండగా మోదీ ఈ హెచ్చరిక చేశారు. ధీరులైన సైనికులు పిడికిలి బిగించి చేసిన 'భారత్ మాతాకీ జై' అనే నినాదాలు సమీపంలోని పాకిస్థాన్‌లోనూ ప్రతిధ్వనించి ఉంటాయి. భారత్ సామర్థ్యం, బలం ప్రధాని మాటల్లో, చేతల్లో ప్రపంచం అంతా చూసింది. భారత సైన్యం పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. ప్రశాంతంగా ఉన్న కశ్మీర్ టూరిజం, పరిశ్రమల రాకతో ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఉగ్రవాద జాడలేమీ మిగలవని భయపడిన పాకిస్థాన్ ఆర్మీ తన కుట్రలను అమలు చేసి తన నెత్తిమీదే చేయి పెట్టుకుంది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ కశ్మీర్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించిన వారానికే పహల్గాంలో టూరిస్టులను చంపేశారు. వెళ్లి మోదీకి చెప్పుకోవాలని పర్యాటకులకు సూచించారు. భారతీయుల జోలికి వచ్చినందుకు వారికి అప్పటికే డెత్ డేట్ ఖరారు అయిందని తర్వాత పరిణామాలు నిరూపించాయి. భారత్ దాడి చేస్తుందని ప్రపంచం అంతా తెలుసు, పాకిస్థాన్‌కూ తెలుసు. అయినా సరే, ఊహించని విధంగా ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోదీ నేతృత్వంలో అమలు చేశారు. తమ ఉగ్రవాద శిబిరాల జాడలు భారత్‌కు తెలియవని అనుకున్నారు. ప్రార్థనా మందిరాల్లో ఉన్నాయి కాబట్టి టెర్రరిస్టుల్ని కాపాడుకోవచ్చని అనుకున్నారు. కానీ ఆపరేషన్ సిందూర్ వంద మందికిపైగా కరుడుగట్టిన ఉగ్రవాదుల అంతం చూసింది. ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ ఆర్మీ, పాలకులు పాల్గొన్న సత్యాన్ని ప్రపంచానికంతటికీ భారత్ తెలియజెప్పింది. పాకిస్థాన్ పిచ్చిపట్టినట్లుగా భారత సరిహద్దుల్లో డ్రోన్ దాడులు చేస్తే, వాటిని కూల్చివేసి, నేరుగా పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు గురిపెట్టింది. తీవ్రంగా దెబ్బతిన్న పాకిస్థాన్... టర్కీ నుంచి తెచ్చుకున్న డ్రోన్లు, చైనా ఇచ్చిన హతాఫ్ క్షిపణులతో దాడికి ప్రయత్నించినా, అన్నింటినీ భారత్ నేలమట్టం చేసింది. భారత్ కొట్టిన దెబ్బకు పాకిస్థాన్‌కు ఉనికి సమస్య వచ్చేసింది, అందుకే కాళ్ల బేరానికి వచ్చింది. 'ఆపరేషన్ సిందూర్'లో మన సైన్యం ధ్వంసం చేసిన ఎయిర్‌బేస్‌లలో అత్యంత ముఖ్యమైనది రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్. ఇది పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ లాజిస్టిక్, కమాండ్ హబ్. ఇక్కడ ఉన్న %జ-%130 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్, %×ూ-%78 రీఫ్యూయలింగ్ ట్యాంకర్స్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్‌ను భారత దళాలు ధ్వంసం చేశాయి. చక్వాల్‌లోని మురిద్ ఎయిర్‌బేస్ మీద భారత్ చేసిన దాడిలో డ్రోన్ సౌకర్యాలు, ఫైటర్ జెట్‌లు ధ్వంసమయ్యాయి. %జేఫ్-%17, మిరాజ్ ఫైటర్ జెట్ స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న రఫీకీ ఎయిర్‌బేస్‌నూ భారత దళాలు టార్గెట్ చేసి ధ్వంసం చేశాయి. రహీం యార్‌ఖాన్ ఎయిర్‌బేస్ రన్‌వేలో భారీ గొయ్యి పడేలా భారత దళాలు బాంబులు వేశాయి. సింధ్ ప్రావిన్స్‌లోని సుక్కూర్ ఎయిర్‌బేస్ రన్‌వే, సౌకర్యాలు దెబ్బతిన్నాయి. పంజాబ్‌లోని చునియన్ ఎయిర్‌బేస్ మీద చేసిన దాడిలో ఎయిర్ డిఫెన్స్ రాడార్‌లు ధ్వంసమయ్యాయి. సింధ్‌లోని భోలారీ ఎయిర్‌బేస్ హ్యాంగర్, రన్‌వేకు పెద్ద నష్టం వాటిల్లి, అక్కడ 50 మందికి పైగా మరణించారు. వీరిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసుఫ్, నలుగురు ఎయిర్‌మెన్ ఉన్నారు. ముషాఫ్ ఎయిర్‌బేస్‌పై భారత్ చేసిన దాడితో కిరనా హిల్స్‌లో భూగర్భ న్యూక్లియర్ నిల్వ స్థలాలకు సమస్యలు వచ్చాయని చెబుతున్నారు. ఈ దాడి పాకిస్థాన్‌లో ఆందోళనను రేకెత్తించింది. ఈ స్థావరం పాక్ ఆక్రమిత కశ్మీర్ సమీపంలో ఉంది. పాకిస్థాన్ సైన్యం లైన్ ఆఫ్ కంట్రోల్ వెంబడి 35%-%40 మంది సైనికులను కోల్పోయింది. ఎయిర్‌ఫోర్స్ అనేక హైటెక్ ఎయిర్ క్రాఫ్ట్‌లను కోల్పోయింది. ఈ దాడులు పాకిస్థాన్ రక్షణ సామర్థ్యాలను, ఆత్మ స్థైర్యాన్ని బాగా దెబ్బతీశాయి. ఎంతగా అంటే భారత ప్రధాని అదంపూర్ ఎయిర్‌బేస్‌లో ప్రసంగిస్తే దానికి పోటీగా పాకిస్థాన్ ప్రధాని కూడా ఓ ఎయిర్‌బేస్‌కు వెళ్లారు. కానీ అక్కడ ఎయిర్‌బేస్ లేదు. యుద్ధ ట్యాంక్‌పై నిలబడి మాట్లాడాల్సి వచ్చింది. మత మౌఢ్యంతో నిండిన టర్కీ.. భారత్‌పై వ్యతిరేకతను నరనరాన నింపుకున్న చైనా తప్ప, ఎవరూ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వలేదు. బ్రహ్మోస్ క్షిపణుల దెబ్బకు పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చింది. కాల్పులు ఆపాలంటూ పాక్ ఆర్మీనే మొదట ప్రతిపాదించింది. అప్పటికే భారత్ తన లక్ష్యాలను చాలావరకూ సాధించింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. పాకిస్థాన్ సైన్యం సమీపకాలంలో కోలుకోలేని విధంగా దాని మౌలిక సదుపాయాల్ని దెబ్బతీసింది. మరొక్కరోజు ఘర్షణలు కొనసాగి ఉంటే కరాచీ పోర్టు నుంచి ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్టు వరకూ ఏవీ మిగిలేవి కావు. భారత్ సాధించిన విజయం ఎంత పద్ధతిగా ఉందో చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణి కోసం 17 దేశాలు ప్రతిపాదనలు పెట్టాయి. యుద్ధం ఎలాంటిదైనా వినాశనమే. అందులో విజేతలు సాంకేతికంగా ఉంటారు కానీ.. యుద్ధం చేసిన వారంతా నష్టపోతారు. ఆ విషయమే ప్రధాని మోదీ చెప్పారు. ఇది యుద్ధాల యుగం కాదన్నారు. అదే సమయంలో ఉగ్రవాద యుగం కూడా కాదని స్పష్టం చేశారు. శత్రువును ఓడించడమే యుద్ధంలో విజయం కానీ.. చంపడం కాదు. చంపడం కన్నా.. ఓడించడం ద్వారా జీవితకాలం ఆ విజయం నిలుస్తుంది. ఈ యుద్ధనీతిని బాగా ఔపోసన పట్టిన నేత ప్రధాని నరేంద్రమోదీ. ఈ భరతమాత ముద్దుబిడ్డ మనదేశాన్ని ప్రపంచంలో అత్యున్నత శక్తిగా నిలబెట్టారు. ఆపరేషన్ సిందూర్ భారత చరిత్రలో ఓ విజయపతాక.

# సిక్కిం విలీనానికి ఏభై ఏళ్ళు




స్వతంత్ర భారత చరిత్రలో సిక్కిం విలీనం ఒక ప్రధాన ఘట్టం. మే 16, 1975న జరిగిన ఈ చారిత్రక ఘట్టానికి ఏభై ఏళ్ళు నిండినందున నాటి గొలుసుకట్టు సంఘటనలు, రాజకీయ పరిస్థితులు, ఇందిరాగాంధీ దూరదృష్టి వంటి అంశాలను సింహావలోకనం చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. భారతదేశానికి ఈశాన్య సరిహద్దులో నేపాల్, భూటాన్‌ల నడుమ ఒక రాష్ట్రం సిక్కిం. వైశాల్యంలో గోవాకు ఒక మెట్టు పైన ఉండే సిక్కిం, జనాభా పరంగా అతి చిన్న రాష్ట్రం. ప్రకృతి సౌందర్యానికి, ప్రశాంతతకు నెలవై, హిమాలయాల పర్వతశ్రేణి ఒడిలో ఒదిగి 500 సంవత్సరాలుగా మనుగడ సాగిస్తున్న దీని చరిత్ర ఆద్యంతం ఆసక్తికరమైనదే. ఎనిమిదవ శతాబ్దంలో పద్మసంభవ (టిబెటన్ భాషలో గురు రింపోచే) అనే బౌద్ధగురువు టిబెట్‌తో పాటు సిక్కింకు వజ్రయాన బౌద్ధాన్ని పరిచయం చేయగా, కొన్ని శతాబ్దాల తరువాత రాజ వంశీకులు (చొగ్యాల్) దానిని అవలంబించారు. ఇరుగు పొరుగు రాజ్యాలైన నేపాల్, భూటాన్‌ల దాడులకు గురైనప్పుడల్లా సిక్కింను టిబెట్ కాపాడేది. 18వ శతాబ్దపు చివర్లో చైనాకు చెందిన క్వింగ్ రాజులు కొన్నాళ్ళు పాలించగా, 1853లో ఈస్ట్ ఇండియా కంపెనీ (బ్రిటిష్) పరమైంది. ఎన్నో మలుపులు తిరిగిన తరువాత 1918లో బ్రిటిష్ ప్రభుత్వం... రక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా సిక్కింకు అంతర్గత వ్యవహారాలలో పూర్తి స్వేచ్ఛనిచ్చింది. సిక్కిం స్టేట్ కాంగ్రెస్ 1948లో రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించడం ప్రారంభించింది. సిక్కిం రాజు%-% భారత ప్రధాని నెహ్రూ సహాయం కోరగా, భారత్ ఒక దివాన్‌ను, కొంత భద్రతా బలగాన్ని అక్కడకు పంపించింది. అప్పుడు ఉత్పన్నమైన విలీన ప్రతిపాదనను "చిన్నదైన ఒక సార్వభౌమ దేశాన్ని కబళించామన్న అపప్రథ తమకు అక్కరలేదని, పైగా ఆ విలీనం చైనాను రెచ్చగొట్టేదిగా కనిపిస్తుంది" అంటూ తిరస్కరించారు నెహ్రూ. 1950లో భారత రక్షణలో మెసిలే రాజ్యంగా సిక్కిం అవతరించింది. 1962లో జరిగిన చైనా%-%భారత్ యుద్ధం భారత రక్షణ వ్యవస్థలో పెను మార్పులకు దారి తీసింది. రక్షణ విషయంలో లాల్ బహదూర్ శాస్త్రి, తరువాత ఇందిరా గాంధీ కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. 1967లో సిక్కిం%-%చైనా సరిహద్దుల్లో గల నాథులా, చోలా కనుమల వద్ద ఇనుప కంచె వేస్తున్న భారత సరిహద్దు దళాల సైనికులను చైనా సైనికులు వెనక్కు జరగమన్నారు. అయినా భారత దళాలు వెనుకడుగు వేయలేదు. ఫలితంగా ఘర్షణ జరిగింది. నాథులా కనుమ వద్ద సెప్టెంబర్‌లో, చోలాలో అక్టోబర్‌లో జరిగిన ఘర్షణలలో ఇరువైపులా ప్రాణ నష్టం జరిగింది. భారత శక్తిని తక్కువ అంచనా వేసిన చైనా దళాలు, మన సైనికుల తెగువతో వెనుదిరిగారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ సిక్కిం భౌగోళిక, వ్యూహాత్మక ప్రాముఖ్యతపై దృష్టి సారించి, దీర్ఘకాలిక ప్రణాళికా రచనలో నిమగ్నమయ్యారు. సిక్కిం ఉత్తరాన ఉన్న చుంబి లోయపై చైనా కన్నువేసిందని ఆమెకు స్పష్టమైన సంకేతాలు అందాయి. సిక్కిం విషయంలో ఒక బలమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గ్రహించి, వెంటనే పావులు కదిపారు. 1973లో జరిగిన ప్రజా ఉద్యమం ధాటికి చొగ్యాల్ (సిక్కిం చక్రవర్తిని చొగ్యాల్‌గా పిలిచేవారు) భారత ప్రభుత్వ సహాయాన్ని అర్థించగా, భారత్ 1200 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను పంపి ఉద్యమాన్ని నియంత్రించింది. అయినా 1974లో సిక్కిం ప్రధానమంత్రి కాజీ లెండుప్ దర్జీ, సిక్కింను భారత్‌లో విలీనం చేయమని ఇందిరా గాంధీకి విజ్ఞప్తి చేయగా, ఆ ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. విలీనం రెఫరెండం ద్వారా జరగాలని నిర్ణయించి, భారత ప్రభుత్వ బలగాల పర్యవేక్షణలో సిక్కిం ఎలక్షన్ కమిషన్‌కు ఆ పని అప్పజెప్పారు. ఏప్రిల్ 6న భారత్ భద్రతా సైనికులు రాజప్రాసాదంలోకి ప్రవేశించి 243 మంది సిక్కిం సైనికులను నిరాయుధులను చేశారు. దురదృష్టవశాత్తు ఒక సైనికుడు మరణించాడు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా, విలీనానికి మద్దతుగా 59,637 ఓట్లు రాగా, వ్యతిరేకంగా కేవలం 1,496 ఓట్లు పడ్డాయి. ఈ రెఫరెండం ప్రక్రియ మోసపూరితంగా భారత భద్రతా దళాల తుపాకుల కనుసన్నలలో జరిగిందని చైనా, పాకిస్తాన్‌లు విమర్శించాయి. దీనిని తిప్పికొడుతూ ఆజాద్ కశ్మీర్, టిబెట్‌ల వైనాలను ఇందిరాగాంధీ ఉదహరించారు. సిక్కిం విద్యార్థుల నిరసనను మన దళాలు సునాయాసంగా అణచివేశాయి. ఆండ్రూ డఫ్ అనే ఆంగ్ల పాత్రికేయుడు తన ' గ్రంథంలో నాటి సంఘటనలు పూసగుచ్చినట్లు వర్ణించాడు. 1975, ఏప్రిల్ 11%-%16 మధ్య జరిగిన రెఫరెండం భారత్‌లో సిక్కిం విలీనానికి మార్గం సుగమం చేసింది. సిక్కిం భారత్‌లో విలీనానికి రాజకీయ పరిస్థితులకు, సాంస్కృతిక కారణాలు కూడా తోడయ్యాయి. అదే ఏడాది మే 16న పార్లమెంట్‌లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను 22వ రాష్ట్రంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. మొత్తానికి సిక్కిం విలీనం ద్వారా ఇందిరాగాంధీ తన రాజకీయ నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని మరొకసారి ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ ఏభై ఏళ్లలో సిక్కిం ఒక ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. వంద శాతం సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగిస్తోంది. తలసరి ఆదాయంలో భారత్‌లో ప్రథమ స్థానాన్ని అందుకుంది. ఎటువంటి వేర్పాటు ఉద్యమాలు లేని ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం ప్రపంచ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. పర్యాటకుల స్వర్గధామమైన ఈ రాష్ట్రం, భారత సరిహద్దులలో ప్రకాశించే మణిపూసగా అభివర్ణించవచ్చు.

# సహజంగా మగ్గిన మామిడిపండ్లు

## గుర్తించడం ఎలా, ఏవి ప్రమాదం?



వేసవి వచ్చిందంటే చాలు, మామిడిపండ్ల రాయల్టీ మొదలైనట్లే. నోరూరించే మామిడి పండ్లను ఆస్వాదించాలని అందరూ ఆరాటపడతారు. అయితే, మార్కెట్లో లభించే అన్ని మామిడిపండ్లు సహజంగా పండినవి కావు. త్వరగా సొమ్ము చేసుకోవాలనే అత్యాశతో కొందరు వ్యాపారులు రసాయనాలను ఉపయోగించి కాయలను కృత్రిమంగా పండిస్తున్నారు. ఇలా రసాయనాలతో పండిన మామిడిపండ్లు ఆరోగ్యానికి హానికరం. కాబట్టి, సహజంగా మగ్గిన మామిడిపండ్లను ఎలా గుర్తించాలి, రసాయనాలతో పండినవి ఎందుకు ప్రమాదకరమో తెలుసుకుందాం.

**సహజంగా మగ్గిన మామిడిపండ్లను గుర్తించడం ఎలా?**

సహజంగా పండిన మామిడిపండ్లను కొన్ని సులభమైన పద్ధతుల ద్వారా గుర్తించవచ్చు

**రంగు:**

సహజంగా పండిన మామిడిపండ్లు ఒకే రంగులో కాకుండా, పసుపు మరియు ఆకుపచ్చ రంగుల మిశ్రమంతో లేదా కొన్నిసార్లు ఎరుపు రంగుతో కూడి ఉంటాయి. రసాయనాలతో పండినవి పండు మొత్తం ఒకే ప్రకాశవంతమైన పసుపు రంగులో కనిపిస్తాయి, అక్కడక్కడ ఆకుపచ్చ లేదా నల్లటి మచ్చలు ఉండవచ్చు. వాసన: సహజంగా పండిన మామిడిపండ్ల నుండి మధురమైన, సహజ సిద్ధమైన వాసన వస్తుంది. రసాయనాలతో పండిన పండ్ల నుండి ఘాటైన వాసన రావచ్చు, లేదా అసలు వాసనే రాకపోవచ్చు.

**తాకి చూడటం:**

సహజంగా పండిన మామిడిపండును నొక్కితే కొద్దిగా మెత్తగా అనిపిస్తుంది. రసాయనాలతో పండినవి ఎక్కువగా మెత్తగా లేదా అసహజంగా గట్టిగా ఉండవచ్చు.

**రుచి:**

సహజంగా పండిన మామిడిపండ్లు చాలా తియ్యగా, పులుపు లేకుండా ఉంటాయి. రసాయనాలతో పండినవి అంత తియ్యగా ఉండవు, కొన్నిసార్లు కొద్దిగా పులుపు ఉండవచ్చు. వీటిని తిన్నప్పుడు నోరు లేదా గొంతులో మంటగా అనిపించవచ్చు.

**గుజ్జు:**

సహజంగా పండిన మామిడిపండు లోపల గుజ్జు ప్రకాశవంతమైన ఎరుపు లేదా పసుపు రంగులో, రసంతో నిండి ఉంటుంది. రసాయనాలతో పండిన పండు గుజ్జు లేత పసుపు లేదా ముదురు పసుపు రంగులో ఉండి, రసం తక్కువగా ఉంటుంది. గుజ్జు అంతా ఒకే విధంగా పండి ఉండదు.

**నీటి పరీక్ష (ఫ్లోట్ టెస్ట్):**

ఒక బకెట్ నిండా నీరు తీసుకుని, అందులో మామిడిపండ్లను వేయండి. సహజంగా పండిన మామిడిపండ్లు నీటిలో మునిగిపోతాయి. రసాయనాలతో పండినవి నీటిపై తేలుతాయి.

**బేకింగ్ సోడా పరీక్ష:**

ఒక గిన్నెలో నీరు తీసుకుని, కొద్దిగా బేకింగ్ సోడా కలపండి. అందులో మామిడిపండును ఒక నిమిషం పాటు ఉంచండి. ఆ తర్వాత పండును కడిగి చూడండి. పండు రంగు మారితే అది రసాయనాలతో పండినట్లు అనుమానించవచ్చు.

**కృత్రిమంగా పండించడానికి ఉపయోగించే రసాయనాలు మరియు ప్రమాదాలు:**

మామిడిపండ్లను కృత్రిమంగా పండించడానికి ఎక్కువగా ఉపయోగించే రసాయనం కాల్షియం కార్బైడ్. ఇది వాతావరణంలోని తేమతో చర్య జరిపి ఎసిటిలీన్ వాయువును విడుదల చేస్తుంది. ఈ వాయువు పండ్లను త్వరగా పక్వానికి వచ్చేలా చేస్తుంది. అయితే, పారిశ్రామిక స్థాయిలో ఉపయోగించే కాల్షియం కార్బైడ్‌లో ఆర్సెనిక్, ఫాస్ఫరస్ వంటి హానికరమైన మలినాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరం.

**కాల్షియం కార్బైడ్ తో పండిన మామిడిపండ్లను తినడం వల్ల కలిగే ప్రమాదాలు:**

**నాడీ వ్యవస్థపై ప్రభావం:**

ఎసిటిలీన్ వాయువు నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మైకం, తలనొప్పి, నిద్రలేమి, మానసిక గందరగోళం వంటి సమస్యలు తలెత్తవచ్చు.

**జీర్ణ సమస్యలు:**

కడుపు నొప్పి, వికారం, వాంతులు, డయేరియా వంటి జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురవ్వవచ్చు.

**చర్మ సమస్యలు:**


చర్మంపై దద్దుర్లు లేదా పుండ్లు ఏర్పడవచ్చు.

దీర్ఘకాలిక అనారోగ్యాలు: కాల్షియం కార్బైడ్ లోని మలినాలు కాలేయం మరియు కిడ్నీలపై ప్రభావం చూపవచ్చు. కొన్ని అధ్యయనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను ప్రేరేపించవచ్చని సూచిస్తున్నాయి.

మింగడంలో ఇబ్బంది, అధిక దాహం, బలహీనత వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. భారతదేశంలో కాల్షియం కార్బైడ్ ను ఉపయోగించి పండ్లను పండించడం నిషేధించబడింది. పండ్లను పండించడానికి ఇథిలీన్ వాయువును ఉపయోగించడానికి అనుమతి ఉంది, ఇది సహజంగా పండ్లలో ఉత్పత్తి అయ్యే హార్మోన్ మరియు ఆరోగ్యానికి అంతగా హానికరం కాదు. మామిడిపండ్ల సీజన్లో వాటిని ఆస్వాదించడం ముఖ్యం, కానీ ఆరోగ్యానికి హాని కలగకుండా జాగ్రత్త పడటం అంతే ముఖ్యం. మామిడిపండ్లను కొనుగోలు చేసేటప్పుడు వాటి రంగు, వాసన, మెత్తదనం వంటి లక్షణాలను జాగ్రత్తగా గమనించండి. వీలైతే, నీటి పరీక్ష వంటివి చేసి నిర్ధారించుకోండి. సహజంగా పండిన మామిడిపండ్లనే ఎంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. ఒకవేళ రసాయనాలతో పండించినవి అని అనుమానం వస్తే, వాటిని పూర్తిగా కడిగి, ముఖ్యంగా గోరువెచ్చని నీటిలో కొంతసేపు ఉంచి తినడం మంచిది. అయినప్పటికీ, రసాయనాలతో పండిన పండ్లకు దూరంగా ఉండటమే ఉత్తమ మార్గం.

## అవాంఛిత రోమాలతో బాధపడుతున్న మహిళలు..

# ఈ చిట్కాలను పాటించాలి..!



అవాంఛిత రోమాల సమస్యతో చాలా మంది మహిళలు బాధపడుతుంటారు. ముఖంపై అవాంఛిత రోమాలు ఎక్కడ ఉన్నా కూడా అంద విహీనంగా కనిపిస్తారని ఆత్మన్యూనతకు లోనవుతుంటారు. అందులో భాగంగానే అన్‌వాంటెడ్ హెయిర్‌ను తొలగించు కోవడానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ చికిత్సలను పాటిస్తుంటారు. అయితే ఇందుకు అంత శ్రమించాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పదార్థాలతోనే సహజసిద్ధంగా అవాంఛిత రోమాలను తొలగించుకోవచ్చని బ్యూటీ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. కొన్ని రకాల పదార్థాలను ఉపయోగించి ఇంటి చిట్కాలను పాటిస్తే అవాంఛిత రోమాలను సులభంగా తొలగించుకోవచ్చని వారు అంటున్నారు. ఇందుకు గాను ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**చక్కెర, నిమ్మరసం మిశ్రమం..**

2 టేబుల్ స్పూన్ల చక్కెర, 2 టేబుల్ స్పూన్ల నిమ్మరసం, 8 టేబుల్ స్పూన్ల నీళ్లను కలిపి ఈ మిశ్రమాన్ని పాన్‌లో వేసి సన్నని మంటపై వేడి చేయాలి. కొంత సేపటికి చక్కెర పూర్తిగా కరిగిపోతుంది. జెల్ లాంటి పదార్థం ఏర్పడుతుంది. ఇది కాస్త వేడిగా ఉండగానే అవాంఛిత రోమాలు ఉన్న చోట రాయాలి. అనంతరం దానిపై ఒక శుభ్రమైన వస్త్రాన్ని ఉంచాలి. కాస్త ఆరాక వెంటనే వస్త్రాన్ని లాగాలి. దీంతో అవాంఛిత రోమాలు ఊడిపోయి వచ్చేస్తాయి. తరువాత నీళ్లతో కడిగేసి మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే అవాంఛిత రోమాల సమస్య ఉండదు. అయితే ఈ చిట్కా కొందరికి పడకపోవచ్చు. సున్నితమైన చర్మం ఉన్నవారు ఈ చిట్కాను పాటించకపోవడమే మంచిది.

**తేనె, నిమ్మరసం..**

1 టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ నిమ్మరసం తీసుకుని బాగా కలిపి అవాంఛిత రోమాలు ఉన్న చోట రాయాలి. 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే అవాంఛిత రోమాలు రాలిపోతాయి. ఈ చిట్కా కాస్త ఆలస్యంగా పనిచేస్తుంది. కానీ చక్కని ఫలితాలను ఇస్తుంది. పైగా ఎలాంటి నొప్పి, బాధ ఉండవు. అలాగే 1-2 టేబుల్ స్పూన్ల పసుపులో కాస్త పాలు లేదా పెరుగు కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని సంబంధిత చోట్ల రాయాలి. పూర్తిగా తడి ఆరిపోయాక స్క్రబ్ చేస్తూ కడిగేయాలి. ఈ చిట్కా కూడా అవాంఛిత రోమాలను తొలగించడంలో అద్భుతంగానే పనిచేస్తుంది.

**బొప్పాయి పండు మిశ్రమం..**

1 లేదా 2 టేబుల్ స్పూన్ల బొప్పాయి పండు గుజ్జును తీసుకుని అందులో కాస్త పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని సంబంధిత చోట్ల రాయాలి. 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. వారంలో 2-3 సార్లు ఈ చిట్కాను పాటించాలి. ఇలా తరచూ చేస్తుంటే సమస్య తగ్గిపోతుంది. 1 ఎగ్ వైట్‌ను తీసుకుని అందులో 1 టేబుల్ స్పూన్ చక్కెర, అర టేబుల్ స్పూన్ కార్న్ ఫ్లోర్ ను వేసి మెత్తని పేస్ట్‌లా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని రాసి పూర్తిగా పొడిగా మారిన తరువాత స్క్రబ్ చేస్తూ కడిగేయాలి. ఇలా తరచూ చేస్తున్నా కూడా అవాంఛిత రోమాలను సులభంగా తొలగించుకోవచ్చు. 2 టేబుల్ స్పూన్ల శనగపిండిలో తగినంత నీళ్లు, రోజ్ వాటర్ వేసి కలిపి అందులోనే కాస్త పసుపును కూడా వేసి కలిపి మెత్తని పేస్ట్‌లా మార్చాలి. దీన్ని రాస్తున్నా కూడా అన్‌వాంటెడ్ హెయిర్ తొలగిపోతుంది. ఇలా ఈ చిట్కాలను పాటిస్తే సమస్య తగ్గడంతోపాటు ముఖం అందంగా కూడా మారుతుంది.

# డయాబెటిస్ ఉన్నవారికి వరం ఈ ఆకులు..

## ఇంకా ఎన్నో లాభాలను పొందవచ్చు..

పొడపత్రి ఆకు.. దీన్నే కేరళ జిన్సెంగ్ అని, బ్రహ్మ మూలిక అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మన దేశంలోని పశ్చిమ కనుమల్లో ఎక్కువగా పెరుగుతుంది. కేరళలో ఈ మొక్కలు మనకు ఎక్కడ చూసినా కనిపిస్తాయి. ఆయుర్వేదంలో ఈ మొక్క ఆకులను ఎంతో పురాతన కాలం నుంచే ఉపయోగిస్తున్నారు. ఈ మొక్క ఆకులు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పొడపత్రి ఆకులను నేరుగా తినవచ్చు. లేదా రసం చేసి కొద్ది మొత్తాల్లో తాగవచ్చు. పొడ పత్రి ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. అలసట, నీరసం తగ్గుతాయి. ఒత్తిడి, ఆందోళ నుంచి ఉపశమనం లభిస్తుంది. పొడపత్రి ఆకులను తీసుకోవడం వల్ల పురుషుల్లో శృంగార సామర్థ్యం పెరుగుతుంది. శృంగారంలో చురుగ్గా పాల్గొంటారు. ఇందుకు గాను ఆకులను రాత్రి పూట తినాల్సి ఉంటుంది.

**ఆర్థరైటిస్ నొప్పులకు..**

పొడపత్రి ఆకుల్లో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు సమృద్ధిగా ఉన్నాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఈ ఆకులను తినడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గిపోతాయి. పొడపత్రి ఆకుల్లో బయో యాక్టివ్ సమ్మేళనాలు అధికంగా ఉన్నాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించడంతోపాటు కణాలను రక్షిస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పొడపత్రి ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. అందువల్ల ఈ ఆకులను తింటే వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**డయాబెటిస్ సమస్యకు..**

పొడపత్రి ఆకుల్లో యాంటీ ఫాటిగ్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులను తింటే ఎంతటి నీరసం, అలసట అయినా త్వరగా తగ్గిపోతాయి. మళ్లీ చురుగ్గా మారుతారు. ఉత్సాహంగా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. పొడపత్రి ఆకుల్లో న్యూరో ప్రొటెక్టివ్ గుణాలు ఉంటాయి. కనుక ఈ ఆకులను తింటే నరాల బలహీనత తగ్గుతుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.



పొడపత్రి ఆకులను షుగర్ ఉన్నవారికి వరంగా చెప్పవచ్చు. ఈ ఆకులను తింటే షుగర్ లెవల్స్ క్రమంగా తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఈ ఆకులను తినడం వల్ల పిండి పదార్థాలు నెమ్మదిగా రక్తంలో కలుస్తాయి. దీంతో షుగర్‌ను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవచ్చు.

**జాగ్రత్త అవసరం..**

పొడపత్రి ఆకులను నేరుగా తినవచ్చు. లేదా రసం తీసి తాగవచ్చు. కానీ స్వల్ప మొత్తాల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఇది వ్యక్తి శరీర తత్వం, ఉన్న వ్యాధిని బట్టి మారుతుంది. కనుక ఈ ఆకులను వాడాలనుకుంటే ఆయుర్వేద వైద్యుల సలహా తీసుకోవాలి. ఒకటి లేదా రెండు ఆకులను తినడం, ఒక టీస్పూన్ రసం సేవించడం సురక్షితంగా భావిస్తారు. పలు రకాల ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ పొడపత్రి ఆకులను విరివిగా ఉపయోగిస్తారు. రాత్రి పూట పొడపత్రి ఆకులను పాలతో తీసుకుంటే పురుషులకు మేలు జరుగుతుంది. గాయాలు, పుండ్లు, చర్మ సమస్యలను తగ్గించేందుకు కూడా ఈ ఆకులను ఉపయోగించవచ్చు. కొద్దిగా పేస్ట్‌లా చేసి ఈ ఆకులను రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా తగ్గుతాయి. అయితే అలర్జీలు ఉన్నవారు ఈ ఆకులను వాడకూడదు.

# ఉత్కంఠ పోరులో పంజాబ్‌దే పైచేయి



ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న పంజాబ్ కింగ్స్ నాకౌట్ దశకు మరింత చేరువైంది. ఆదివారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్ ను చిత్తుగా ఓడించింది. నేహల్ వధేరా(70), శశాంక్ సింగ్(59 నాటౌట్) మెరుపులతో కొండంత స్కోర్ చేసిన పంజాబ్..అనంతరం ఆల్‌రౌండ్ షోతో ప్రత్యర్థిని 209కే కట్టడి చేసింది. ధ్రువ్ జురెల్(53) ఒంటరి పోరాటం చేసినా.. కీలక వికెట్లు తీసిన హర్‌ప్రీత్ బ్రార్(3-22) రాజస్థాన్ నడ్డివిరిచాడు. దాంతో, పంజాబ్ 10 పరుగుల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన సంజూ సేనమరో ఓటమిని మూటగట్టుకుంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో అదరగొడుతున్న పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ బరిలో నిలిచింది. ఆదివారం జరిగిన డబుల్ హెడర్ తొలి పోరులో రాజస్థాన్ రాయల్స్‌పై ఉత్కంఠ విజయంతో టేబుల్‌లో రెండో స్థానానికి ఎగబాకింది. తొలుత నేహల్ వధేరా(70), శశాంక్ సింగ్ (నాటౌట్) దంచికొట్టగా.. హర్‌ప్రీత్ బ్రార్(3-22) రాజస్థాన్ నడ్డివిరిచాడు. పేస్ బౌలింగ్ యూనిట్ సమిష్టిగా రాణించగా.. సంజూ సేన ఓటమి పాలైంది. జురెల్(53) మినహా టెయిలెండర్లు విఫలం కావడంతో, పంజాబ్ 10 పరుగుల తేడాతో గెలుపొందింది. పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 220 ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ తమ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో యశస్వీ జైస్వాల్(50 నాటౌట్).. ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాత మార్కో యాన్సెన్ ఓవర్లో వైభవ్ సూర్యవంశీ(40) తన ప్రతాపం చూపించి 6, 4, 6 బాదగా 17 రన్స్ వచ్చాయి. ఈ ఇద్దరు లెఫ్ట్ హ్యాండర్ల విధ్వంసంతో రాజస్థాన్ స్కోర్ 3 ఓవర్లకు స్కోర్ 50 దాటింది.

**వైభవ్ సూర్యవంశీ(40)**

ఈ జోడీని విడదీసేందుకు స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్‌ను రంగంలోకి దింపిన అయ్యర్ ఫలితం సాధించాడు. వైభవ్.. పెద్ద షాట్ ఆడబోయి యాన్సెన్ చేతికి చిక్కాడు. దాంతో, 76 వద్ద రాజస్థాన్ తొలి వికెట్ పడింది. అయినా సరే యశస్వీ జోరు తగ్గించకపోవడంతో రాజస్థాన్ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 89 పరుగులు చేసింది. కానీ, హర్‌ప్రీత్ అర్ధ శతకంతో జోరుమీదున్న యశస్విని ఔట్ చేసి పంజాబ్‌కు మరో బ్రేకిచ్చాడు.

**జురెల్ ఒంటరి పోరాటం**

ఆ కాసేపటికే అజ్మతుల్లా బౌలింగ్‌ను సంజూ శాంసన్(20) ను ఔట్ చేసి రాజస్థాన్ గెలుపు ఆశలపై నీళ్లు చల్లాడు. నాలుగో వికెట్‌కు 30 రన్స్ జోడించిన రియాన్ పరాగ్(13)ను ఔట్ చేసిన బ్రార్.. మూడో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. అప్పటికే సాధించాల్సిన రన్‌రేట్ 14కు చేరింది. ధ్రువ్ జురెల్(53), షిమ్రన్ హెట్‌మైర్(11)లు..గెలిపించే బాధ్యత తీసుకున్నా పంజాబ్ బౌలర్లు అవకాశం ఇవ్వలేదు. అర్ష్‌దీప్ వేసిన 17వ ఓవర్లో జురెల్ సిక్సర్ బాదగా పంజాబ్ స్కోర్ 170 దాటింది. దాంతో, సమీకరణం 18 బంతుల్లో 41కి చేరింది. అయితే.. హెట్‌మైర్ ఔట్ అయ్యాడు. కానీ, ఒంటరి పోరాటం చేసిన జురెల్ 18వ ఓవర్లో సిక్సర్ బాదగా.. 12 బంతుల్లో 15 రన్స్ అవసరమయ్యాయి. అయితే.. అర్ష్‌దీప్ 8 రన్స్ మాత్రమే ఇవ్వగా.. 20వ ఓవర్లో జురెల్, హసరంగ వరుస బంతుల్లో ఔట్ అయ్యారు. దాంతో, పంజాబ్ 10 పరుగుల తేడాతో జయభేరి మోగించింది.

**వధేరా, శశాంక్ విధ్వంసం**

తొలుత ఆడిన పంజాబ్ కింగ్స్‌కు శుభారంభం దక్కకపోయినా.. యువకెరటం నేహల్ వధేరా(70) అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడినా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(30)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దేశ్‌పాండే విజృంభణతో 34కే మూడు కీలక వికెట్లు పడిన పంజాబ్‌ను అయ్యర్, నేహల్ వధేరా (70)లు ఆదుకున్నారు. క్రీజులో కుదురుకున్నాక జోరు పెంచిన ఇద్దరూ బౌండరీలతో హడలెత్తించారు. దాంతో, 10 ఓవర్లకు పంజాబ్ స్కోర్ 97కు చేరింది. అయితే.. దంచికొడుతున్న అయ్యర్.. రియాన్ పరాగ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వత గేర్ మార్చిన వధేరా.. ఆకాశ్ మధ్వాల్ బౌలింగ్‌లో రెండో ఫోర్లతో అర్ధ శతకం సాధించాడు.

**నేహల్ వధేరా (70), శశాంక్ సింగ్(59 నాటౌట్)**

ప్రమాదకరంగా మారిన వధేరాను ఆకాశ్ ఔట్ చేయగా రాజస్థాన్ బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ఆ తర్వాత అజ్మతుల్లా ఒమర్‌జాయ్(21 నాటౌట్), శశాంక్ సింగ్(59 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. మఫాకా వేసిన 18 ఓవర్లో అజ్మతుల్లా రెచ్చిపోయాడు. 4, 6, 4 బాది 16 పరుగులు పిండుకున్నాడు. అనంతరం ఆకాశ్‌కు చుక్కలు చూపిస్తూ బౌండరీ బాదాదు అజ్మతుల్లా. 20 ఓవర్లో 6, 4 తో కలిపి 17 రన్స్ రావడంతో పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 219 పరుగులు చేసింది.



## వధేరా, శశాంక్ విధ్వంసం..

### రాజస్థాన్ ముందు భారీ లక్ష్యం..!



ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న పంజాబ్ కింగ్స్‌ద భారీ స్కోర్ చేసింది. టాపార్డర్ విఫలమైనా.. యువకెరటం నేహల్ వధేరా(70) అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడినా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(30)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో ఆఖర్లో శశాంక్ సింగ్(59 నాటౌట్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్(21 నాటౌట్) విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికారేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. దాంతో, పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. జైపూర్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ బౌలింగ్ ఎంచుకుంది. అయితే.. ఈసీజన్‌లో జోరు మీదున్న ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(9)ను తక్కువ స్కోర్‌కే ఔట్ చేసిన తుషార్ దేశ్‌పాండే రాజస్థాన్‌కు రెండో ఓవర్లోనే బ్రేకిచ్చాడు. కాసేపటికే ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన మిచెల్ ఓవెన్(0)ను క్వెనా మఫాకా డకౌట్ చేశాడు.

## టీ20ల్లో 7వ శతకం..

### రికార్డులు తిరగరాసిన రాహుల్



భారత జట్టుకు ఆపద్భాందవుడైన కేఎల్ రాహుల్ ఐపీఎల్‌లోనూ అదరగొడుతున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలుస్తున్న రాహుల్ ఐపీఎల్ 18వ సీజన్‌లో శతకంతో గర్జించాడు. ఆదివారం గుజరాత్ టైటాన్స్ బౌలర్లను ఊచకోత కోస్తూ 60 బంతుల్లోనే మెరుపు సెంచరీ సాధించాడీ హిట్టర్. తద్వారా ఐపీఎల్‌లో ఐదోసారి మూడంకెల స్కోర్ అందుకున్న రాహుల్.. రికార్డులు తిరగరాశాడు. ఐపీఎల్‌లో మూడు జట్ల తరఫున సెంచరీ బాదిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు రాహుల్. పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ తరఫున వంద కొట్టిన అతడు.. ఇప్పుడు ఢిల్లీ తరఫున శతక్కొట్టాడు. అంతేకాదు ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన నాలుగో క్రికెటర్‌గా, రెండో భారతీయుడిగా ఈ దాషింగ్ బ్యాటర్ ఘనత సాధించాడు.

## మే 25న వీడ్కోలు మ్యాచ్..

### కోల్‌కతా స్క్వాడ్‌లో మిస్టరీ స్పిన్నర్..!



ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన కోల్‌కతా నైట్ రైడర్స్ టోర్నీని విజయంతో ముగించాలనుకుంటోంది. మే 25న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగబోయే గేమ్ కోసం మిస్టరీ స్పిన్నర్‌ను తీసుకుంది ఫ్రాంచైజీ. ఐపీఎల్ వాయిదా సమయంలో స్వదేశం వెళ్లిన వెస్టిండీస్ ఆల్‌రౌండర్ రొవ్‌మన్ పావెల్ స్థానంలో శివం శుక్లా తో ఒప్పందం చేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ యువకెరటంను స్క్వాడ్‌లో చేర్చుకున్నామని ఆదివారం కోల్‌కతా ఫ్రాంచైజీ ఎక్స్ వేదికగా వెల్లడించింది. దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న శివం శుక్లా రాకతో కోల్‌కతా స్పిన్ బలం మరింత పెరగనుంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 29 ఏళ్ల శుక్లా ఒకే సీజన్ ఆడాడు. బెంగాల్‌పై 29 పరుగులకే 4 వికెట్లతో సత్తా చాటాడు. నిరుడు మధ్యప్రదేశ్ లీగ్‌లోనూ తన వైవిధ్యమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్న శివం 10 వికెట్లు తీశాడు. దాంతో, ఆ లీగ్‌లో అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచాడీ యంగ్‌స్టర్.

**బ్యాటింగ్‌లో తేలిపోయి..**

పదిహేడో సీజన్‌లో సంచలన ఆటతో టైటిల్ కొల్లగొట్టిన కోల్‌కతా ఈసారి మాత్రం ఉసూరుమనిపించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా 18వ సీజన్ ఆడిన అజింక్యా రహానే బృందం బ్యాటింగ్‌లో తేలిపోయింది. టాపార్డర్ వైఫల్యానికి తోడు హిట్టర్లు రింకూ సింగ్ ఆండ్రూ రస్సెల్ దారుణంగా విఫలమవ్వడం ఆ జట్టు విజయావకాశాల్ని దెబ్బకొట్టింది. అయితే.. ఆఖర్లో పుంజుకొని 12 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులోకి వచ్చింది. కానీ, ఐపీఎల్ వాయిదా పడ్డాక జరిగిన తొలి పోరు వర్షార్పణం కావడంతో కోల్‌కతాకు కన్నీరే మిగిలింది. శనివారం చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరగాల్సిన మ్యాచ్ టాస్ పడకుండానే రద్దయ్యింది. దాంతో, ఇరుజట్లకు చెరొక పాయింట్ లభించింది. దాంతో, టోర్నీ నుంచి వైదొలిగిన కోల్‌కతా.. మే 25న సన్‌రైజర్స్‌తో చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది.

## తొలి శతకంతో రెచ్చిపోయిన సుదర్శన్..

# ప్లే ఆఫ్స్‌లో గుజరాత్, ఆర్సీబీ, పంజాబ్..!



ఐపీఎల్ 18వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌పై అదిరే విజయం తో తొలి బెర్తును కైవసం చేసుకుంది. విధ్వంసక బ్యాటింగ్‌తో అలరిస్తున్న సాయి సుదర్శన్(108 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్(93 నాటౌట్) సైతం కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లను చితక్కొట్టిన ఈ కుర్ర జోడీ.. జట్టును 10 వికెట్ల తేడాతో గెలిపించింది. ఈ విజయంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ బెర్తు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుజరాత్ విక్టరీతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు సైతం నాకౌట్ పోరుకు అర్హత సాధించాయి. ఐపీఎల్‌లో అడుగు పెట్టిన తొలి సీజన్‌లోనే కప్ కొట్టిన గుజరాత్ టైటాన్స్.. మరో టైటిల్ వేటలో దూసుకెళ్తోంది. ఆదివారం డబుల్ హెడర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 10 వికెట్ల తేడాతో గెలుపొంది ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది గుజరాత్. ప్రత్యర్థి నిర్దేశించిన 200 ఛేదనలో ఓపెనర్లు దంచేశారు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సాయి సుదర్శన్(108 నాటౌట్) ఫోర్లతో అలరించాడు. అక్షర్ పటేల్ వేసిన తొలి ఓవర్లో సాయి బౌండరీ కొట్టగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(93 నాటౌట్) సిక్సర్ బాదాడు. అనంతరం నటరాజన్ ఓవర్లో సాయి రెచ్చిపోయి 6, 4, 4, 4 సాధించాడు. వీళ్లిద్దరూ ధనాధన్ ఆడుతుండంతో 26 బంతుల్లోనే 50 పరుగులు వచ్చాయి. దాంతో, గుజరాత్ 6 ఓవర్లలో 59 పరుగులు చేసింది.

సూపర్ ఫామ్‌లో ఉన్న గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి ఆ కాసేపటికే అక్షర్ పటేల్ బౌలింగ్‌లో బౌండరీతో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు సుదర్శన్. 30 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో యాభై మార్క్ అందుకున్నాడీ హిట్టర్. అదే ఓవర్లో శుభ్‌మన్ గిల్(28 నాటౌట్) భారీ సిక్సర్ బాదడంతో గుజరాత్ స్కోర్ 80 దాటింది. చమీర వేసిన 12వ ఓవర్లో ఫోర్‌తో గిల్ కూడా ఫిఫ్టీ సాధించాడు. అదే ఓవర్లో సాయి కూడా బౌండరీ కొట్టగా 19 పరుగులు వచ్చాయి. వికెట్ తీసే బౌలర్ కరువవడంతో ఈ జోడీ బౌండరీలతో రెచ్చిపోయింది. నటరాజన్ వేసిన 17వ ఓవర్లో శివాలెత్తిపోయిన గిల్.. వరుసగా 4, 6 బాదాడు. కుల్దీప్ ఓవర్లో స్ట్రెయిట్‌గా సిక్సర్ బాదిన సాయి ఐపీఎల్‌లో తొలి సెంచరీ సాధించాడు. విప్రజ్ బౌలింగ్‌లో సిక్సర్‌తో జట్టుకు 10 వికెట్ల విజయాన్ని అందించాడు.

**రాహుల్ 5వ సెంచరీ..**

ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్(112 నాటౌట్) గర్జించాడు. సూపర్ సెంచరీతో జట్టుకు కొండంత స్కోర్ అందించాడు. గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన రాహుల్ బౌండరీలతో విధ్వంసం సృష్టించాడు. ఐపీఎల్‌లో తనకు తిరుగులేదని చాటుతూ ఐదో సెంచరీ సాధించాడు. అతడికి అభిషేక్ పోరెల్(30) సహకరించగా.. ఆఖర్లో ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. దాంతో ఢిల్లీ 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

# అమ్మ అని పిలిచి నట్టేట ముంచేశాడు

## జయం రవిపై అత్త ఆవేదన






ప్రముఖ నటుడు జయం రవి కుటుంబంలో వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఆయన భార్య ఆర్తితో విడాకుల వ్యవహారం కోర్టులో కొనసాగుతుండగా, ఆయన అత్త, సినీ నిర్మాత సుజాత విజయ్‌కుమార్ తాజాగా సంచలన ఆరోపణలతో మీడియా ముందుకు వచ్చారు. జయం రవి ప్రవర్తన వల్లే తాను తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నానని, ఆయన తనకిచ్చిన మాటను కూడా నిలబెట్టుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామం కోలీవుడ్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సినీ నిర్మాణ రంగంలోకి రావడానికి జయం రవి ప్రోత్సాహమే కారణమని సుజాత విజయ్‌కుమార్ తెలిపారు. తన అల్లుడిని సొంత కొడుకులా భావించానని, ఆయన హీరోగా 'అడంగ మరు', 'భూమి', 'సైరన్' వంటి చిత్రాలను నిర్మించానని ఆమె పేర్కొన్నారు. ఈ సినిమాల నిర్మాణం కోసం ఫైనాన్షియర్ల నుంచి దాదాపు రూ. 100 కోట్లు అప్పు చేశానని, అందులో 25 శాతం జయం రవికే పారితోషికంగా చెల్లించానని ఆమె స్పష్టం చేశారు. ఈ లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని కూడా ఆమె వెల్లడించారు. తన ప్రకటనలో సుజాత విజయ్‌కుమార్ మాట్లాడుతూ, "అప్పుల వల్ల నేను నిద్రలేని రాత్రులు గడిపాను. వాటిపై వచ్చే వడ్డీలన్నీ నేనొక్కదాన్నే కట్టేదాన్ని. 'సైరన్' సినిమా సమయంలో నష్టాలను భర్తీ చేయడానికి నా బ్యానర్‌లోనే మరో సినిమా చేస్తానని జయం రవి మాట ఇచ్చాడు. కానీ, ఇప్పటివరకు ఏ సినిమాకు సంతకం చేయలేదు. అంతేకాదు, అప్పులు తీర్చడానికి కూడా ఎలాంటి సహాయం చేయలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. జయం రవి తనను ప్రేమగా 'అమ్మా' అని పిలిచేవాడని, కానీ ఇప్పుడు సానుభూతి కోసం ఆయన చేస్తున్న ఆరోపణలు తనను తీవ్రంగా బాధించాయని ఆమె అన్నారు. ఆయనలోని హీరో అనే భావన తనలో పోతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, ఆయన ఎప్పటికీ తన దృష్టిలో హీరోగానే ఉండాలని కోరుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ తాజా ఆరోపణలు జయం రవి వ్యక్తిగత జీవితంలో మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఈ విషయంపై జయం రవి ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

# విజయ్ సేతుపతిని కలుసుకున్న విశాల్..




ప్రముఖ నటులు విశాల్ మరియు విజయ్ సేతుపతి ఇటీవల చెన్నై విమానాశ్రయంలో అనుకోకుండా కలుసుకున్నారు. ఈ విషయాన్ని విశాల్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. "నా ప్రియమైన స్నేహితుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి విజయ్ సేతుపతిని చెన్నై విమానాశ్రయంలో కలిశాను. అతన్ని చూడటం ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటుంది. అతను ఎంతో ఉత్సాహంగా ఉంటాడు. చాలా కాలం తర్వాత అతన్ని కలవడం చాలా ఆనందంగా అనిపించింది. కొద్ది నిమిషాలు మాత్రమే మాట్లాడినా చాలా సంతోషంగా ఉంది. అతని భవిష్యత్తు ప్రయత్నాల కోసం నా శుభాకాంక్షలు. దేవుడు నిన్ను దీవించుగాక. త్వరలోనే మళ్ళీ కలుస్తానని ఆశిస్తున్నాను," అని విశాల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. విశాల్ పంచుకున్న ఈ విషయంపై అభిమానులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, భవిష్యత్తులో ఈ ఇద్దరు స్టార్ నటులు కలిసి ఒక చిత్రంలో నటిస్తే చూడాలని ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఆకస్మిక సమావేశం సినీ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

# నరకానికి అయిన వెళ్తాను కానీ పాకిస్తాన్‌కు వెళ్లను : జావేద్ అక్తర్



బాలీవుడ్ ప్రముఖ గీత రచయిత, లిరిక్ రైటర్ జావేద్ అక్తర్ తాజాగా పాకిస్తాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "ఒకవేళ నరకాన్ని లేదా పాకిస్తాన్‌ను ఎంచుకోవాల్సి వస్తే, నేను నరకానికే వెళ్లడానికి ఇష్టపడతాను" అని ఆయన అన్నారు. ముంబైలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా జావేద్ అక్తర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తనకు ఇరువైపుల (భారత్ మరియు పాకిస్తాన్) నుండి ప్రశంసలు, తిట్లు వస్తుంటాయని ఆయన పేర్కొన్నారు. "కొందరు నన్ను 'కాఫిర్' అని తిట్టి నరకానికి వెళ్తావని అంటారు, మరికొందరు 'జిహాదీ' అని పిలిచి పాకిస్తాన్‌కు వెళ్లమని చెబుతారు. ఒకవేళ ఈ రెండింటినే ఎంచుకోవాల్సి వస్తే, నేను నరకానికే వెళ్లడానికి ఇష్టపడతాను" అని ఆయన వ్యంగ్యంగా అన్నారు. జావేద్ అక్తర్ గతంలో కూడా పాకిస్తాన్‌పై పలు సందర్భాల్లో విమర్శలు చేశారు. ముఖ్యంగా 26/11 ముంబై దాడుల విషయంలో ఆయన పాకిస్తాన్‌ను నిలదీశారు. అంతేకాకుండా, కశ్మీర్‌ను పాకిస్తాన్ తమ సొంతం అని చెప్పుకోవడం అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. కశ్మీరీలు భారతీయులని, వారిలో 99 శాతం మంది భారతదేశానికి విధేయులుగా ఉన్నారని ఆయన తెల్పి చెప్పారు. జావేద్ అక్తర్ చేసిన ఈ తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తుంటే, మరికొందరు విమర్శిస్తున్నారు. అయితే, జావేద్ అక్తర్ తన మనసులోని మాటను నిర్భయంగా చెప్పడానికి ఎప్పుడూ వెనుకాడరని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బుర్జ్ ఖలీఫాపై 'హరిహర వీరమల్లు' ట్రైలర్ ప్లాన్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు జ్యోతికృష్ణ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'హరిహర వీరమల్లు' ప్రమోషన్ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇటీవల మేకర్స్ మొదటి భాగం 'హరిహర వీరమల్లు పార్ట్-1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' విడుదల తేదీని జూన్ 12గా అధికారికంగా ప్రకటించారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. చిత్ర బృందం సినిమాను గ్లోబల్ స్థాయిలో ప్రమోట్ చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే ట్రైలర్‌ను వినూత్నంగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దుబాయ్‌లోని ప్రపంచ ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫా భవనంపై 'హరిహర వీరమల్లు' ట్రైలర్‌ను విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనంపై తెలుగు సినిమా ట్రైలర్ విడుదల కావడం ఇదే తొలిసారి కానుంది. ఇంతకుముందు బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ నటించిన 'జవాన్' సినిమా ట్రైలర్‌ను బుర్జ్ ఖలీఫాపై విడుదల చేశారు. ఒకవేళ 'హరిహర వీరమల్లు' ట్రైలర్ బుర్జ్ ఖలీఫాపై విడుదలయితే, ఈ ఘనత సాధించిన మొట్టమొదటి తెలుగు సినిమాగా ఇది రికార్డు సృష్టిస్తుంది. కాగా, ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కీలక పాత్ర పోషిస్తోంది. బాలీవుడ్ నటులు అనుపమ్ ఖేర్, బాబీ డియోల్, నోరా ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్తా తదితరులు ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ నిక్ పాల్ ఆధ్వర్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏ.ఎం. రత్నం

# తిరుమలలో ప్రముఖుల సందడి.. స్వామివారిని దర్శించుకున్న ఐశ్వర్య రాజేష్, వైభవ్, గౌతమ్ గంభీర్





ఆదివారం వీకెండ్ కావడంతో కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు పలువురు సినీ, క్రీడ ప్రముఖులు తరలివచ్చారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సినీ నటి ఐశ్వర్య రాజేష్, నటుడు వైభవ్, ఆది పినిశెట్టి ఆయన భార్య నిక్కీ గల్రాని ప్రత్యేకంగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు వైకుంఠ క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి చేరుకున్న వీరికి తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అధికారులు సాదరంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వీరంతా గర్భగుడిలో కొలువుదీరిన శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి వేదాశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. మరోవైపు, భారత క్రికెట్ జట్టు మాజీ ఆటగాడు, కోచ్ గౌతం గంభీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి వేకువజామున జరిగిన శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అలాగే, మాజీ ప్రధాన మంత్రి దేవెగౌడ మరియు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా వేర్వేరుగా తిరుమలకు చేరుకుని శ్రీ వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రముఖుల రాకతో తిరుమలలో సందడి వాతావరణం నెలకొంది.

# వరల్డ్‌వైడ్‌గా విజయ్ సేతుపతి ఏస్.. తెలుగులో రిలీజ్ చేస్తుందెవరో తెలుసా..?




పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి. మక్కళ్ సెల్వన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం ఏస్ ఈ చిత్రానికి 'ఒరు నల్ల నాల్ పాత్తు సొల్రెన్' ఫేం ఆరుముగకుమార్ దర్శకత్వం వహించాడు. రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించగా.. యోగి బాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఏస్ మే 23, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రాన్ని తెలుగులో ఎస్పీ సినిమాస్ విడుదల చేస్తున్నట్టు మేకర్స్ తెలియజేశారు. రొమాంటిక్ క్రైం కామెడీ నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీతో రుక్మిణి వసంత్ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. దివ్య పిళ్లై, బబ్లూ పృథ్వీరాజ్, బిఎస్. అవినాష్, ముత్తు కుమార్, రాజ్ కుమార్, డెనెస్ కుమార్, ఆల్విన్ మార్టిన్, ప్రిస్సిల్లా నాయర్, జాస్పర్ సుపయ్య, కార్తీక్ జై, నాగులన్, జహ్రినారిస్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని 7%జం% ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ నిర్మిస్తుంది.

Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy (Dist) Telangana Cell : 9705043131,8096660656